

హద్దుమీరిన అవినీతి!

మచిలీపట్నం సర్వజన ఆస్పత్రిలో ఉద్యోగుల తీరుపై విమర్శలు

- శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థినుల నుంచి రూ.10 వేలు చొప్పున డిమాండ్
- నగదు ఇస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని 20 మందికి బెదిరింపులు
- ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేసిన బాధితులు
- జూనియర్ అసిస్టెంట్‌ను పిలిచి మాట్లాడిన ఉన్నతాధికారి
- కార్యాలయ ఏవో నగదు వసూలు చేయమన్నారని వివరణ
- ఆ తర్వాత ఎక్కడ తన ఉద్యోగానికి ఇబ్బంది వస్తుందోనని భయపడి ఆత్మహత్యాయత్నం

“ మచిలీపట్నం సర్వజన ఆస్పత్రిలో అవినీతి వ్యవహారాలు హద్దుమీరాయి. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థినులకు సర్టిఫికెట్లు ఇవ్వాలంటే ఒక్కొక్కరు రూ.10 వేలు చొప్పున ఇవ్వాలని కార్యాలయ ఉద్యోగులు డిమాండ్ చేశారు. అంత ఇవ్వలేమని వేడుకున్నా.. కనికరం చూపకుండా బెదిరింపులకు దిగారు. విధిలేని పరిస్థితుల్లో విద్యార్థినులు ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఉన్నతాధికారి సదరు జూనియర్ అసిస్టెంట్‌ను పిలిచి ప్రశ్నించడంతో కార్యాలయ ఏవో చెబితేనే నగదు అడిగానని సమాధానం ఇచ్చిన జూనియర్ అసిస్టెంట్, ఈ వ్యవహారం ఎక్కడ తనకు చుట్టుకుంటుందోనని భయపడి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ వ్యవహారం ఆస్పత్రిలో సంచలనంగా మారింది.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జూనియర్ అసిస్టెంట్ పవన్

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: మచిలీపట్నం సర్వజన ఆస్పత్రిని అవినీతి జాడ్యం పట్టిపీడిస్తోంది. మచిలీపట్నం నోబుల్ కళాశాలలో వివిధ వృత్తివిద్యాకోర్సులు చదువుతున్న 20 మంది విద్యార్థినులు ఆస్పత్రిలో పరిపాలనాపరమైన శిక్షణ పొందుతున్నారు. వీరికి శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు ఇవ్వాల్సి ఉంది. అయితే సర్టిఫికెట్‌లు ఇవ్వాలంటే ఒక్కొక్కరు రూ.10వేల చొప్పున నగదు ఇవ్వాలని ఆస్పత్రి కార్యాలయ ఉద్యోగులు డిమాండ్ చేశారు. అంత నగదు ఇవ్వలేమని విద్యార్థినులు గత కొన్ని రోజులుగా కార్యాలయ సిబ్బందిని ప్రాధేయపడుతున్నారు. తాము అడిగినంత నగదు ఇస్తేనే సర్టిఫికెట్‌లు ఇస్తామని కార్యాలయ ఉద్యోగులు స్పష్టం చేశారు. దీంతో విధిలేక విద్యార్థినులు నేరుగా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆశాలతను గురువారం కలిసి ఈ విషయంపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తమ ఆవేదనను ఆమెకు వివరించారు. దీనిపై స్పందించిన సూపరింటెండెంట్ వెంటనే సంబంధిత విభాగం పరిపాలనా వ్యవహారాలు చూసే జూనియర్ అసిస్టెంట్ పవన్‌ను చాంబరుకు పిలిచి వివరాలు అడిగితెలుసుకున్నారు. కార్యాలయ ఏవో రమణమూర్తి విద్యార్థినుల నుంచి నగదు తీసుకోమని ఒత్తిడి చేస్తేనే తాను అడిగానని జూనియర్ అసిస్టెంట్ చెప్పాడు. ఆ తర్వాత సూపరింటెండెంట్ చాంబర్ నుంచి బయటకు వచ్చిన పవన్ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న వివిధ రకాల టానిక్‌లను తాగేశాడు. దీంతో అప్రమత్తమైన సిబ్బంది అతన్ని ఆస్పత్రిలోని వార్డులోకి తరలించారు. ప్రస్తుతం అతను చికిత్స పొందుతున్నాడు. శిక్షణ పొందుతున్న విద్యార్థినుల నుంచి కూడా ఆస్పత్రి కార్యాలయ ఉద్యోగులు లంచం అడిగిన అంశం వెలుగులోకి రావడం, ఈ వ్యవహారం నుంచి తప్పించుకునేందుకు జూనియర్ అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నం చేయడం ఆస్పత్రివర్గాల్లో చర్చనీయాంశమైంది.

అనేక ఫిర్యాదులు

ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న వారు, పదవీ విరమణ చేసిన ఉద్యోగులు అనారోగ్యం పాలై ఆస్పత్రుల్లో చికిత్స పొందిన తర్వాత మెడికల్ రీయింబర్స్‌మెంట్ కోసం దరఖాస్తులు చేసుకుంటే ఆస్పత్రి కార్యాలయ ఉద్యోగులు ప్రతి ఫైలుకు ఇంతరేటు నిర్ణయించి మరీ నగదు వసూలు చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.

డిప్యూటీ సీఎం దృష్టికి..

పలువురు పదవీ విరమణ పొంది మెడికల్ రీయింబర్స్ మెంట్ బిల్లులు పెట్టుకున్న వారు.. ఎంతకీ తమ బిల్లులను చేయకపోవడంతో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, కలెక్టర్ బాలాజీ, వైద్యశాఖ రాజమండ్రి ఆర్‌జేడీ, వైద్యశాఖ డైరెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదులు చేశారు. ఒక రిటైర్ట్ మహిళా టీచర్ అనారోగ్యం పాలై ఆస్పత్రిలో చికిత్స పొంది, అన్ని ఆధారాలు ఇచ్చి రెండు సార్లుగా మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల కోసం దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. ఈ బిల్లులు చేసేందుకు ఆస్పత్రి కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ ఒకరు రూ.3వేలు తీసుకున్నారని తెలిపారు. ఆస్పత్రి కార్యాలయ సూపరింటెండెంట్‌కు మరో రూ.3వేలు ఇవ్వలేదనే కారణంతోనే ఫైలును పక్కన పెట్టేశారని అక్కడి సిబ్బంది చెబుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బిల్లు పెట్టుకున్న ఓ రిటైర్డ్ టీచర్ కూడా ఈ నెల 4వ తేదీన మరణించారని తెలిపారు. కాగా, ఆస్పత్రిలో జరుగుతున్న అవినీతిపై 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 9వ తేదీన 'ఆస్పత్రిలో ఆ ఇద్దరు' అనే శీర్షికతో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఈ అంశంపై విచారణకు అధికారులు ఆదేశించారు.



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జిల్లా పరిషత్ ఉద్యోగులకు సీట్ల కేటాయింపు

- ఉత్తర్వులు జారీ చేసిన జెడ్పీ అధికారులు
- ఆరు నెలల నిరీక్షణకు తెర

మచిలీపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు సీట్లు కేటాయిస్తూ ఎట్టకేలకు జెడ్పీ అధికారులు బుధవారం అర్ధరాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది జూన్‌లో జెడ్పీ ఉద్యోగుల బదిలీలు కౌన్సెలింగ్ పద్ధతిలో జరిగాయి. వివిధ విభాగాల్లో సూపరింటెండెంట్‌లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు ఇతర కేటగిరీలోని ఉద్యోగులు బదిలీపై జెడ్పీ కార్యాలయానికి వచ్చారు. గత ఆరు నెలలుగా వీరికి సీట్లు కేటాయించకుండా జెడ్పీ అధికారులు జాప్యం చేస్తూ వచ్చారు. ఈ విషయంపై 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 12వ తేదీన 'ఆర్నెల్లుగా ఖాళీనే' అనే శీర్షికతో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన జెడ్పీ ఉన్నతాధికారులు బుధవారం రాత్రి తొమ్మిది గంటల నుంచి అర్ధరాత్రి వరకు వివిధ కేటగిరీలోని ఉద్యోగులకు ఒక్కొక్కరిని పిలిచి ఎవరికి, వారికే పోస్టింగ్‌లు ఇస్తూ విడివిడిగా ఉత్తర్వులు అందజేశారు.

హత్య కేసులో ఏడుగురికి జీవిత ఖైదు

మచిలీపట్నం మండలం బుద్దాలపాలెం కేసులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సంచలన తీర్పు

మచిలీపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నిందితులపై నేరం రుజువు కావడంతో ఏడుగురికి జీవిత ఖైదు విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపి గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2006లో సంభవించిన భారీ వర్షాల కారణంగా మచిలీపట్నం మండలం బుద్దాలపాలెంలో రైతులు పంటలు కోల్పోయారు. కొందరి గృహాలు కూలిపోయాయి. ఆ సమయంలో ఒక స్వచ్ఛంద సంస్థ గ్రామస్థులకు సాయం చేసేందుకు కూపన్లు అందజేసింది. సాయం అందుకునే సమయంలో గ్రామస్థులు రెండు వర్గాలుగా విడిపోయి పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ ఘటనపై అప్పట్లో ఇరువర్గాలపై మచిలీపట్నం తాలూకా పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ కేసులో తమకు వ్యతిరేకంగా సాక్ష్యం చెబుతాడనే కారణంతో మిగతా 6లో..

నీటిపై నిఘా

- జలవనరుల శాఖను ఫైళ్లు అడిగిన విజిలెన్స్
- కేఈ, కేసీ, డ్రెయిన్ల విభాగాల పనులపై ఫిర్యాదులు
- ఆ విభాగాలకు లేఖలు పంపిన విజిలెన్స్ అధికారులు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ): కృష్ణాజిల్లా జలవనరుల శాఖలో జరిగిన పనులపై విజిలెన్స్ దృష్టిసారించింది. టెండర్లను, కాంట్రాక్టర్లు చేసిన పనులను సరిచూడాలని అధికారులు భావిస్తున్నారు. ప్రతి ఏడాది నీటి సంవత్సరం (జూన్ నుంచి ఏప్రిల్ వరకు) ముగిశాక జరిగే పనులపై అనేక ఆరోపణలు వస్తున్నాయి. కాంట్రాక్టర్లు, అధికారులు మిలాఖత్ అయి వ్యవహారాలు సాగిస్తున్నారు. కాంట్రాక్టర్లు ముట్టజెప్పే కమీషన్లకు కక్కుర్తిపడిన అధికారులు జరిగిన పనులపై ఎలాంటి పర్యవేక్షణ చేయట్లేదు. కృష్ణాజిల్లాలో 2024-25, 2025-26 నీటి సంవత్సరాల్లో జరిగిన పనుల వివరాలను అందజేయాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు జలవనరుల శాఖ అధికారులకు లేఖలు రాశారు. దీంతో అధికారులు, కాంట్రాక్టర్లలో వణుకు మొదలైంది.

ఆ మూడు డివిజన్లలో అధిక పనులు

జలవనరుల శాఖలో మొత్తం ఐదు డివిజన్లు ఉన్నాయి. వాటిలో కృష్ణా తూర్పు, కృష్ణా సెంట్రల్, డ్రెయినేజీ డివిజన్లలో ప్రతి ఏడాది పనులు జరుగుతుంటాయి. ఈ మూడు డివిజన్ల కింద పలు సెక్షన్ కార్యాలయాలు ఉంటాయి. వాటి పరిధిలో ఉన్న కాల్వల్లో తూడికతీత, పూడికతీత, గుర్రపుడెక్క తొలగింపు, కల్వర్టుల మరమ్మతులు వంటి పనులు ప్రతి నీటి సంవత్సరం ముగింపు తర్వాత చేపడతారు. ఏయే డివిజన్‌లో పరిధిలో ఏయే పనులు చేపట్టాలన్న దానిపై ఏఈ, డీఈ, ఈఈలు ప్రతిపాదనలు రూపొందిస్తారు. వాటిని ఎస్‌ఈకి పంపిస్తారు. వాటిని ఆయన సీఈకి పంపుతారు. పరిశీలన తర్వాత కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) సమావేశంలో ఆమోదిస్తారు. తర్వాత జలవనరుల శాఖలోని టెండర్ల విభాగం నోటిఫికేషన్ విడుదల చేస్తుంది.

కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం

ఈ పనులు దక్కించుకోడానికి కాంట్రాక్టర్లు తక్కువకు టెండర్లు వేస్తున్నారు. తర్వాత పనులు చేయకుండా కాలం గడుపుతున్నారు. కొంతమంది కొంతవరకు పనులు చేసి, తర్వాత ఏదో ఒక సాంకేతిక కారణంతో నిలుపుదల చేస్తున్నారు. మరికొంతమంది కాంట్రాక్టర్లు తూతూమంత్రంగా పనులు చేసి మమ.. అనిపిస్తున్నారు. ఈవిధంగా రూ.కోట్ల విలువచేసే పనులను కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కాల్వల్లో పూడికతీత పనులు సరిగ్గా తీయకపోవడంతో శివారు ఆయకట్టు ఉన్న పొలాలకు నీరు అందట్లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాంట్రాక్టర్లు ఇచ్చే ముడుపుల ముచ్చటలో ఉండిపోతున్న డీఈ, మిగతా 6లో..

శాటిలైట్.. రైట్ రైట్

- ప్రైవేట్ బస్సులకు ధీటుగా ఆర్టీసీ శాటిలైట్ ప్రతిపాదన
- ఆటోనగర్, ఉయ్యూరు బస్‌స్టేషన్ల ఎంపిక
- హయ్యండ్ బస్సులను నడిపే యోచన
- పీఎన్‌బీఎస్‌పై రద్దీ తగ్గించేందుకు ప్లాన్
- ప్రజల చెంతకే బస్సులు వెళ్లేలా స్టాప్ పాయింట్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఆర్టీసీ గేరు మార్చింది. ప్రైవేట్ ట్రావెల్స్ పోటీని తట్టుకోవటానికి ప్రజల వద్దకే హయ్యండ్ బస్సులు తీసుకెళ్లాలని భావిస్తోంది. పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ (పీఎన్‌బీఎస్)పై పడే రద్దీని తగ్గించటానికి, ప్రజలు కోరుకున్న చోట బస్సులు ఆపటానికి వీలుగా శాటిలైట్ బస్టేషన్లను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ప్రయోగాత్మకంగా ఆటోనగర్, ఉయ్యూరు బస్‌స్టేషన్లను ఇలా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది.

ఇప్పటివరకు పీఎన్‌బీఎస్ నుంచే..

ఆర్టీసీ హయ్యండ్ బస్సులన్నీ దాదాపు పీఎన్‌బీఎస్ నుంచి దూరప్రాంతాలైన హైదరాబాద్, విశాఖపట్నం, బెంగళూరు, చెన్నైకు నడుస్తున్నాయి. నగర శివారున ఉన్న ప్రయాణికులు దూరాభారాన ఉన్న పీఎన్‌బీఎస్‌కు రావాల్సి వస్తోంది. ప్రైవేట్ బస్ ఆపరేటర్లు మాత్రం ప్రయాణికులకు అందుబాటులో ఉండేలా బెంజిసర్కిల్, ఎన్టీఆర్ సెంటర్, రామవరప్పాడు సెంటర్ ఇలా సబ్ పాయింట్ల నుంచే బస్సులను నడుపుతున్నారు. దీంతో ప్రైవేట్ బస్సులు ప్రజలకు దగ్గర ప్రాంతాల్లో అందుబాటులో ఉంటున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ అధికారులు కూడా ప్రజలకు అందుబాటులో హయ్యండ్ బస్సులు తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఆటోనగర్, ఉయ్యూరు బస్ డిపోల నుంచి ఇప్పటికే



ఉయ్యూరు బస్టాండ్

హైదరాబాద్, బెంగళూరు, చెన్నైకు కొన్ని హయ్యండ్ బస్సులను నడుపుతున్నారు. ఇవి సత్ఫలితాలను ఇస్తున్నాయి. పీఎన్‌బీఎస్ నుంచి నడిచే అధిక శాతం హయ్యండ్ బస్సులను శాటిలైట్ బస్టేషన్ల నుంచి నడపాలని ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు. 90 శాతానికి పైగా ఆటోనగర్ బస్ డిపో నుంచి నడపాలని భావిస్తున్నారు. డాల్ఫిన్ క్రూయిజర్లు, అమరావతి, వెన్నెల స్లీపర్, నైట్ రైడర్, ఇంద్ర తదితర ఏసీ బస్సులను ఆటోనగర్ నుంచే హైదరాబాద్, విశాఖపట్నం, బెంగళూరు, చెన్నైకు నడపనున్నారు. అలాగే, మరికొన్ని సర్వీసులను ఉయ్యూరు బస్ డిపో నుంచి కూడా నడుపుతారు. శాటిలైట్ బస్‌స్టేషన్ల నుంచి ప్రారంభమయ్యే బస్సులు పీఎన్‌బీఎస్‌కు రావు. ఆటోనగర్ నుంచి హైదరాబాద్ వెళ్లే బస్సులకు ఎన్టీఆర్ సర్కిల్, బెంజిసర్కిల్, కుమ్మరిపాలెం, భవానీపురం, గొల్లపూడి.. ఇలా పాయింట్లు ఇచ్చి అక్కడ ఆగేలా చర్యలు తీసుకుంటారు. ఆటోనగర్ నుంచి విశాఖపట్నం వెళ్లే బస్సులు ఎన్టీఆర్ సర్కిల్, బెంజిసర్కిల్, రామవరప్పాడులో కొద్దిసేపు ఆగి ప్రయాణికులను ఎక్కించుకునేలా బోర్డింగ్ పాయింట్లు నిర్దేశిస్తారు.

ఆటోనగర్ ఇంటిగ్రేటెడ్ బస్ టెర్మినల్‌కు లైన్‌క్లియర్

ఆటోనగర్ బస్‌స్టేషన్‌ను ఇంటిగ్రేటెడ్ టెర్మినల్‌గా అభివృద్ధి చేసే ప్రతిపాదనలను ఆర్టీసీ అధికారులు పూర్తిచేసి హెడ్డాఫీసుకు పంపారు. ప్రైవేట్ అండ్ పబ్లిక్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో ఔత్సాహిక సంస్థలకు అప్పగించాలని చూస్తున్నారు. గ్రౌండ్ ఫ్లోర్ అంతా బస్ టెర్మినల్, స్టేషన్ అధికారులు, డిపో అధికారుల చాంబర్లు వంటివి ఉండేలా డిజైన్లు సిద్ధం చేశారు. ఫస్ట్, సెకండ, థర్డ్, ఫోర్త్ ఫ్లోర్లు కమర్షియల్‌గా నియోగించుకునేందుకు వీలుగా డిజైన్లను రూపొందిస్తున్నారు. ఉన్నతాధికారులు అనుమతి ఇవ్వడమే తరువాయి.

భారీగా పెరిగిన ఓఆర్

ప్రైవేట్ బస్సులపై రవాణా శాఖ దాడుల నేపథ్యంలో వారం పాటు ఆర్టీసీకి గణనీయంగా ఆక్యుపెన్సీ పెరిగింది. తనిఖీల భయంతో ప్రైవేట్ ఆపరేటర్లు తమ బస్సులను రద్దు చేశారు. ప్రయాణికులకు చార్జీల మొత్తాన్ని వెనక్కి ఇచ్చారు. దీంతో చాలామంది ఆర్టీసీ బస్సులను ఆశ్రయించారు. ఫలితంగా సగటు ఆక్యుపెన్సీ కంటే 25 శాతం అదనంగా పెరిగింది. ప్రైవేట్ బస్సులను పునరుద్ధరించటంతో మళ్లీ 25 శాతం ఓఆర్ పడిపోయింది. ఈ క్రమంలో ప్రైవేట్ బస్సులను ధీటుగా ఎదుర్కొంటే తప్ప మనుగడ సాధించలేమని ఆర్టీసీ భావిస్తోంది. అందుకే శాటిలైట్ బస్‌స్టేషన్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది.

విజయవాడ-విశాఖ మధ్య క్వాడ్రా లైన్

- ముమ్మరంగా సాగుతున్న సర్వే పనులు
- ప్రస్తుతం ఉన్న డబుల్ లైన్ ద్వారానే రాకపోకలు
- రెండు ప్రాంతాల నడుమ 120 రైళ్లు.. అత్యంత రద్దీగా సెక్షన్
- పాత ట్రాక్‌ల కారణంగా వేగ నియంత్రణ పాటించాల్సిన పరిస్థితి
- వందేభారత్ వెళ్లాలంటే మిగిలిన రైళ్లను రద్దు చేయాల్సి దుస్థితి
- క్వాడ్రాలైన్ కోసం రైల్వేబోర్డుకు డీపీఆర్ పంపిన అధికారులు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ - విశాఖ మధ్యన ప్రస్తుతం డబుల్ లైన్ ఉంది. దీనికి అదనంగా మరో డబుల్ లైన్‌ను అభివృద్ధి చెయ్యాలని విజయవాడ డివిజనల్ రైల్వే అధికారులు దక్షిణ మధ్య రైల్వేకు గతంలో ప్రతిపాదించారు. సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను కూడా తయారు చేసి దక్షిణ మధ్య రైల్వేకు సమర్పించారు. దక్షిణ మధ్య రైల్వే ఈ డీపీఆర్‌ను రైల్వే బోర్డుకు పంపడంతో సర్వేకు ఆదేశించింది. సర్వే ప్రకారం ఫిజిబిలిటీ నివేదికతో పాటు ఈ ప్రాజెక్టుకు ఎంతమేర భూసేకరణ అవసరం అవుతుంది? ఎంత వ్యయం అవుతుందన్న దానిపై మరింత స్పష్టత వస్తుంది. ప్రస్తుతం రైల్వేబోర్డు ఆదేశాల మేరకు విజయవాడ - విశాఖపట్నం మధ్యన క్వాడ్రా లైన్‌కు ముమ్మరంగా సర్వే జరుగుతోంది. అదనంగా మరో రెండు లైన్ల నిర్మాణానికి ఎంత భూములు అవసరమవుతాయి ? ప్రస్తుత డబుల్ లైన్ వెంబడి ఉన్న ప్రాంతాలలో అధ్యయనం చేయటం జరుగుతోంది. కొత్త సంవత్సరం ఫిబ్రవరి, మార్చి నాటికి సర్వేను పూర్తి చేసి రైల్వేబోర్డుకు నివేదిక సమర్పించే అవకాశం ఉంది.

క్వాడ్రాలైన్ ఎందుకంటే..

విజయవాడ - విశాఖ మధ్యన ప్రస్తుతం రోజుకు 120పైగా రైళ్లు నడుస్తున్నాయి. పాసింగ్ త్రూ రైళ్లు అయితే ఇంకా చాలా ఉన్నాయి. విజయవాడ - విశాఖ మధ్యన రద్దీ విపరీతంగా ఉంది. ఇలా రిజర్వేషన్ తెరవగానే.. అలా సీట్లు బుక్ అయిపోతున్నాయి. చాంతాడంత వెయిటింగ్ లిస్టులు ఉంటున్నాయి. సీట్ల లభ్యత అనేది కష్టంగా ఉంటోంది. పాత ట్రాకుల కారణంగా రైళ్లు కూడా వేగంగా వెళ్లలేకపోతున్నాయి. వేగపరిమితిని నియంత్రించాల్సి వస్తోంది. కొత్త రైళ్లను ప్రవేశపెట్టాలన్నా ఇబ్బందిగా ఉంటోంది. వందే భారత్ రైలు వేగంగా ప్రయాణించే విషయంలో ఈ మార్గంలో ఇబ్బందులు మిగతా 6లో..

చిట్ నిర్వాహకుల ఆస్తుల జప్తునకు రాష్ట్ర హోంశాఖ ఆదేశాలు

- గతంలో ప్రైవేటు చిట్‌ల పేరుతో గుడివాడలో భారీ మోసం
- 27 మందికి రూ.78 లక్షల టోకరా
- ఆ నగదుతో భారీగా ఆస్తుల కొనుగోలు చేసిన నిర్వాహకులు
- ఆ ఆస్తుల ఆటాచ్‌మెంట్‌కు అనుమతినిస్తూ జీవో 156 జారీ

గుడివాడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు చిట్‌లు నిర్వహించి భారీ మోసానికి పాల్పడిన ముగ్గురు నిందితుల ఆస్తుల జప్తునకు రాష్ట్ర హోంశాఖ ఆదేశాలు జారీ చేసిన అంశం గుడివాడలో చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే.. గుడివాడ పట్టణం నీలామహల్ రోడ్డులో నివాసముంటున్న నల్లమోతు భవానీ గత ఎనిమిదేళ్లుగా ప్రైవేట్ చిట్‌లను నిర్వహిస్తున్నారు. కొంతకాలం తర్వాత ఆమె చిట్‌ల నిర్వహణ బాధ్యతను తన బావ పాండురంగారావు కుమారుడు రామ్‌గోపాల్, కుమార్తె ప్రియాంకలకు అప్పగించింది. ప్రారంభంలో చిట్ పాడుకున్న వారికి సకాలంలో నగదు చెల్లించటంతో వీరిపై ప్రజలకు నమ్మకం పెరిగింది. అదే సమయంలో వీరికి డబ్బుపై ఆశ పెరిగింది. ఈ క్రమంలో చిట్‌ల చెల్లింపులో తాత్సరం చేయడం ఆరంభించారు. ఈ క్రమంలో బాధితుల నుంచి ఒత్తిడి పెరగడంతో ముగ్గురు నిర్వాహకులు పరారయ్యారు. దీంతో బాధితులు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. దీనిపై కేసు నమోదైంది. ప్రస్తుతం కోర్టులో కేసు నడుస్తోంది.

పోలీసుల ప్రత్యేక చొరవతో..

ప్రైవేట్ చిట్ నిర్వాహకుల పరారీపై వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ అప్పటి జిల్లా ఎస్పీ గంగారధరరావు ఆదేశాల మేరకు చిట్ ఫండ్ యాక్టు, సెక్షన్ 3 ప్రకారం కేసు నమోదు చేశారు. 30 మంది బాధితులను విచారించగా, 27 మంది బాధితులకు రూ.78 లక్షల మేర నగదును చెల్లించాల్సి ఉందని తేల్చారు. అదే విధంగా ముగ్గురు నిందితులు భారీగా ఆస్తులను కూడబెట్టుకున్నట్లు విచారణలో నిర్ధారించారు. సదరు విషయాన్ని అప్పటి జిల్లా ఎస్పీ గంగాధరరావు దృష్టికి తీసుకువెళ్లారు. బాధితులకు న్యాయం చేయాలనే ఉద్దేశ్యంతో మిగతా 6లో..

ఆర్‌ఎస్‌కేలను సద్వినియోగం చేసుకోండి
● ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలనలో కలెక్టర్ బాలాజీ

8

మున్నలో మట్టి అక్రమ తవ్వకాలు
● 4 ట్రాక్టర్లు, నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

అనధికార లేఅవుట్లపై

సీఆర్డీఏ అధికారుల కొరడా

గన్నవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు మండలంలో సీఆర్డీఏ అధికారులు అనధికార లేఅవుట్‌లపై కొరడా ఝుళిపించారు. అనధికారికంగా లేఅవుట్ వేశారన్న సమాచారం సీఆర్డీఏ అధికారులకు అందింది. గురువారం ఉంగుటూరు సర్వే నెంబర్ 141(పి) 1.50 ఎకరాల్లో అనధికార లేఅవుట్‌ను సీఆర్‌డీఏ అధికారులు ధ్వంసం చేశారు. అనుమతులు లేకుండా లేఅవుట్‌లు వేస్తే ఊరుకోబోమని చెప్పారు. అన్ని అనుమతులు తీసుకున్న తరు వాతనే లేఅవుట్‌లు వేసుకోవాలని చెప్పారు. సీఆర్డీఏ పరిధిలో అనధికార లేఅవుట్‌లను ఎట్టి పరిస్థితులలో ఉపేక్షించబోమని హెచ్చరించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

గన్నవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు మండలంలోని నందమూరు, తేలప్రోలు, ఆత్కూరు గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా జాయింట్ కలెక్టర్ మల్లారపు నవీన్ గురువారం పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని వసతులను పర్యవేక్షించారు. రైతులకు కనీస సౌకర్యాలు కల్పించాలని జేసీ నవీన్ ఆదేశించారు. సంబంధిత ధాన్యం కొనుగోలు కేంద్రం సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు గోనె సంచులు అవసరమైనంత నిల్వ ఉంచాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయని ఆరా తీశారు. రైతులందరు తమ ధాన్యాన్ని ప్రభుత్వం ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారి జి.రమేష్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభం

విజయవాడ రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నున్న వికాస్ కాలేజి రోడ్డులోని శ్రీ అభయ ఆంజనేయస్వామి దేవస్థానంలో నూతన విమాన శిఖర శిలా ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవాలు గురు వారం ప్రారంభమైయ్యాయి. మూడు రోజుల పాటు జరగనున్న ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా గురువారం వేకువ జాము నుంచి వేద పండితులు విశేష పూజలు నిర్వహించారు. ముందుగా విష్వక్సేనారాధన, గోపూజ, పుణ్యాహవచనము, పంచ గవ్యారాధన, అకల్మష హోమము, వాస్తు హోమము, చతుర్దశ కలశ స్థాపన, నీరా జనం, మంత్రపుష్ప తీర్థ ప్రసాద వినియోగం జరిగాయి. సాయంత్రం అస్త్ర దీపారాధన, మేదినీ పూజ, అంకురారోపణ, అగ్నిమధనము, కుంభారాధన, పంచసూక్త హోమము తదితర పూజలు నిరహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పండితులు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వెంచర్‌లో ఉమ్మడి స్థలం అమ్మితే చర్యలు

ఉయ్యూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ వెంచర్లలో ఉన్న ఉమ్మడి స్థలాన్ని విక్రయిస్తే అమ్మిన వారిపై చర్యలు తీసుకుంటామని జిల్లా పంచాయతీ అధికారి అరుణ అన్నారు. మండలంలోని గండిగుంటలో గురువారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ, మండలంలోని గండిగుంట రియల్ ఎస్టేట్ వెంచర్లలో ఉన్న ఉమ్మడి స్థలాలను ఆయా వెంచర్ యజమానులు అక్రమంగా విక్రయిస్తున్నారన్నారు. కామన్ సైట్ పర్యవేక్షణ బాధ్యత పంచాయతీ కార్యదర్శులు, డిప్యూటీ ఎంపీడీవోలదే అన్నారు. కామన్ సైట్‌ల పర్యవేక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. అదే విధంగా కాటూరులో వేసిన వెంచర్‌లో కామన్ సైట్‌ను ఓ వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని మండి పడ్డారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కోటేశ్వరరావు, గ్రామ కార్యదర్శి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దాతల దాతృత్వం అభినందనీయం

కంకిపాడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలకు అవసరమైన రూ. 2 కోట్ల విలువైన స్థలాన్ని దానం చేయడం అభినందనీయమని ఎంపీడీవో అనూష అన్నారు. మండలంలోని ఉప్పలూరులో జిల్లా పరిషత్ పాఠశాలకు అవసరమైన 50 సెంట్ల స్థలాన్ని జిల్లా పరిషత్‌కు రిజిస్ట్రేషన్ చేసి గురువారం అప్పగించారు. ఈ సందర్భంగా స్థల దాత అన్నే పద్మనాభరావును ఆమె సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అనూష మాట్లాడుతూ సుమారు రూ. 2 కోట్ల విలువైన స్థలాన్ని తల్లిదండ్రులు అన్నే రామలింగయ్య, రాజ్యలక్ష్మీల పేరుమీద దానం చేయడం మామూలు మాటకాదన్నారు. ఇటువంటి దాతల దాతృత్వాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ అన్నే ధనయ్య, ఏఎంసీ మాజీ ఛైర్మన్ మద్దాలి రామచంద్రరావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు చలసాని రాధాకృష్ణమూర్తి, ఈవో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలను

విజయవంతం చేయాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేలా గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నిర్వహించే పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని మానికొండ గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోగినేని వెంకటేశ్వరరావు సూచించారు. మానికొండ, కానుమోలు, వీరవల్లి గ్రంథాలయాధికారుల పర్యవేక్షణలో 14వ తేదీ నుంచి 20తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు గురువారం తెలిపారు. కానుమోలు గ్రంథాలయాధికారి రహీం, వీరవల్లి గ్రంథాలయాధికారి స్వర్ణలత, మానికొండ గ్రంథాలయాధికారి హరికృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, వకృత్వ పోటీలు వేర్వేరుగా నిర్వహించనున్నట్టు తెలిపారు.



టీడీపీ కమిటీలతో ప్రమాణం చేయిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

టీడీపీ మరింత బలోపేతానికి ప్రతి కార్యకర్త

కసిగా పనిచేయాలి: ఎమ్మెల్యే బోడె

పెనమలూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ విముక్త రాష్ట్రాన్ని సాధించేందుకు ఎన్నికల ముందు ఎంత కసిగా పనిచేశామో అదే కసితో టీడీపీ మరింత బలోపేతానికి ప్రతి కార్యకర్త పనిచేయాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పిలుపునిచ్చారు. పోరంకి టీడీపీ కార్యాలయంలో గురువారం అట్టహాసంగా జరిగిన వివిధ స్థాయిల పార్టీ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం వల్ల అధోగతి పాలయిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టే పనిలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు పార్టీ కార్యకర్తలు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు అండగా నిలవాలని కోరారు. రాష్ట్ర అభివృద్ధికి, ముందు తరాల భవిష్యత్తుకు, సంక్షేమానికి, పెట్టుబడుల సాధనకు నిత్యం పాటుపడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబును యువత ఆదర్శంగా తీసుకొని సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని, రాష్ట్ర అభివృద్ధిలో తాము భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. తాను ఎమ్మెల్యే అయినా మీలాగే క్రమశిక్షణ కలిగిన కార్యకర్తనన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు ప్రతి కార్యకర్త, నాయకుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకులు జువ్వాది రాంబాబు, మారుపూడి ధనకోటేశ్వరరావు, అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకరబాబు, కోయ ఆనంద్‌ప్రసాద్, యార్లగడ్డ సుచిత్ర, కుర్రా నరేంద్ర, మేడసాని రత్నకుమారి, దేవినేని రాజా, సంగెపు రంగారావు, అన్నే ధనయ్య, కొండా ప్రవీణ్, అనంతనేని ఆజాద్, తుమ్మల రాంకుమార్, జంపన గుర్నాథరావు, వల్లభనేని సత్యనారాయణ, పీతా గోపీచంద్, శొంఠి శివరాంప్రసాద్, తాడిశెట్టి వీరాస్వామి, వెనిగళ్ల కుటుంబరావు, జంపని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నిలువెత్తు నిర్లక్ష్యం!



పిచ్చిచెట్ల మధ్య తెల్లదేవరపల్లి పంపింగ్ స్కీమ్

(ఆంధ్రజ్యోతి, తిరువూరు/విస్సన్నపేట)

తిరువూరు, విస్సన్నపేట మండలాలకు రక్షిత తాగు నీటిని అందించేందుకు ఉమ్మడి రాష్ట్రంలో తెల్లదేవరపల్లి వాటర్ పంపింగ్ స్కీమ్‌కు శంకుస్థాపన జరిగింది. పనులైతే మొదలు పెట్టారు కానీ, పూర్తి చేయలేకపోయారు. ఆలనా పాలన లేక ప్రాజెక్టు నిరుపయోగంగా మారింది. కోట్లు ఖర్చుచేసి నిర్మించిన పంపింగ్‌స్కీమ్ భవనం పిచ్చిచెట్లమధ్య దీనంగా కనిపిస్తోంది. దీనికి సంబంధించిన విద్యుత్ మోటర్లు చోరీకి గురయ్యాయి. తిరువూరు, విస్సన్నపేట మండలాల్లో పలు గ్రామాలకు సురక్షిత తాగునీరు అందించేందుకు, తాగు నీటి సరఫరా పైలెట్‌ప్రాజెక్టు నిర్మాణానికి అప్పటి ప్రభుత్వ పెద్దలు విస్సన్నపేట మండలంలోని తెల్లదేవరపల్లి గ్రామాన్ని ఎంపిక చేశారు. 2009లో సుమారు రూ.11 కోట్ల అంచనాతో ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయటం జరిగింది. నాటి స్థానిక ఎమ్మెల్యే, హోంమంత్రిగా ఉన్న కోనేరు రంగారావు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి నూతిపాడు వద్ద ఎత్తిపోతల పథకంతో పాటు తెల్లదేవరపల్లి

కోట్లు ఖర్చు చేసి ప్రారంభించిన తెల్లదేవరపల్లి తాగునీటి పంపింగ్ స్కీమ్‌ను అసంపూర్తిగానే వదిలేశారు.. ఉమ్మడి రాష్ట్రంలో శంకుస్థాపన చేసిన ఈ ప్రాజెక్టుకు ఇప్పటికీ అడుగులు పడక తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోంది. ఇప్పటికైనా ప్రజల దాహార్తిని తీర్చే అతి ముఖ్యమైన వాటర్ పంపింగ్ ప్రాజెక్టును పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వంపై నియోజకవర్గ ప్రజలు గంపెడాశలు పెట్టుకున్నారు. ఇప్పటికే ప్రబలుతున్న కిడ్నీ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని అయినా స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్‌లు సమస్యకు పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది.



తాగునీటి స్టోరేజీ కోసం నాడు సిద్ధం చేసిన ముత్యాలమ్మ చెరువు

- తెల్లదేవరపల్లి పంపింగ్ స్కీమ్‌కు మోక్షం ఎప్పుడు?
- వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యంగా వదిలేశారు
- అభివృద్ధి చేస్తే.. తిరువూరు నియోజకవర్గ ప్రజలకు సాంత్వన
- దీనావస్థలో నిరుపయోగంగా పంపింగ్ స్కీమ్
- కూటమి ప్రభుత్వంలోనైనా పూర్తిచేయాలని ఎదురుచూపులు

తాగునీటి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. గ్రామీణ తాగునీటి సరఫరాశాఖ ప్రత్యేక విభాగం ఆధ్వర్యంలో పనులు ప్రారంభించారు. తెల్లదేవరపల్లి వద్ద పంపింగ్ స్కీమ్ పనులతో పాటు, ఈ ప్రాంతంలో ముత్యాలమ్మ చెరువును సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌గా అభివృద్ధి చేశారు. చెరువు విస్తీర్ణం తక్కువగా ఉండటంతో, సమీపంలోని సాగుభూముల్ని ఎకరానికి రూ.2.50 లక్షలు చెల్లించి, అప్పట్లో కొనుగోలు చేసి మరోట్యాంక్ (చెరువు)ను సిద్ధం చేశారు. ఈ రెండు చెరువుల విస్తీర్ణం 100 ఎకరాలు చేసి స్టోరేజ్ ట్యాంక్‌గా మార్చారు. ఎన్‌ఎస్పీ కాల్వ నుంచి నీటిని సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్‌కు మళ్లించి, అక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు పైపులైన్లు ఏర్పాటు చేసి, విద్యుత్ మోటర్లద్వారా తిరువూరు, విస్సన్నపేట మండలంలోని గ్రామాలకు నీటిని సరఫరా చేసేందుకు, ఆయా ప్రాంతాలకు పైపులైన్లు వేశారు. తెల్లదేవరపల్లి నుంచి తిరువూరు తాగునీటి పంపింగ్ స్కీమ్ వరకు పైపులైన్ నిర్మించారు. కాలక్రమంలో పథకం అంచనాలు పెరిగిపోయాయి. ప్రస్తుతం తెల్లదేవరపల్లి తాగునీటి పైలెట్‌ప్రాజెక్టుకు సుమారు రూ.23 కోట్లు ఖర్చు చేశారు. తిరువూరు నగర పంచాయతీగా మార్పుచెందడంతో, గ్రామీణ నీటి సరఫరా శాఖలో ఉన్న ఈ స్కీమ్ ద్వారా పట్టణం పరిధిలో తాగునీటి సరఫరా చేసే అవకాశం లేకుండా పోయింది. దీంతో తిరువూరు, విస్సన్నపేట మండల తాగునీటి సరఫరా నిమిత్తం చేపట్టిన ఈ పథకాన్ని కేవలం విస్సన్నపేటకు మాత్రమే తాగు నీటి సరఫరాకు పరిమితం చేశారు. ప్రస్తుతం ఈపథకం పూర్తి కావాలంటే మరో రూ.10 కోట్లకు పైగా నిధులు అవసరమని అంచనాలు వేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వహయాంలో ఈ పథకాన్ని పూర్తిగా విస్మరించడంతో, ఓవర్‌హెడ్ ట్యాంక్, పంపింగ్ స్కీమ్ భవనం, తిరువూరు, విస్సన్నపేట ప్రధాన రహదారిపక్కన, పిచ్చిచెట్ల మధ్య దీనంగా కనిపిస్తోంది. 2023 సంవత్సరంలో ఈ పంపింగ్‌స్కీమ్ భవనంలోని విద్యుత్ మోటార్లు చోరీకి గురవడంతో, అప్పటి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విస్సన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి కేసు నమోదు కాలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం పంపింగ్‌స్కీమ్ భవనంలోకి వెళ్లలేని విధంగా భవనం చుట్టూ చెట్లు పెరిగాయి.



చోరీకి గురైన విద్యుత్ మోటార్లు

స్టోరేజ్ ట్యాంక్ ముళ్లచెట్లతో, పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. ప్రస్తుతం ఈ పథకానికి పర్యవేక్షణ అధికారులు లేకపోవడంతో ప్రాజెక్టు కోసం ఖర్చుచేసిన సుమారు రూ.25 కోట్ల ప్రజాధనం వృథా అనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. తాగునీటి ప్రాజెక్టును పూర్తి చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామానికే తలమానికంగా ఉంటుందనుకున్నాం

- రాయాల నాగమణి, సర్పంచ్ తెల్లదేవరపల్లి



రెండు మండలాలకు తాగునీరు అందించే ప్రాజెక్టుకు గ్రామాన్ని ఎంపికచేయడంతో ఎంతో గర్వించాం. గ్రామం తలమానికంగా ఉంటుందనుకుంటే.. ఈ ప్రాజెక్టు అసంపూర్తిగా వదిలివేయడం గ్రామానికి మచ్చలా మారింది. ఈ పథకం పూర్తికి కూటమి ప్రభుత్వం దృష్టిసారించాలి.

చెరువులో నీరులేదని పనులు చేయలేదు

- రాయాల సురేష్, ఆయకట్టు రైతు, తెల్లదేవరపల్లి



స్టోరేజి ట్యాంక్‌లో నీరులేదనే సాకుతో అధికారులు పనులు చేయలేదు. ప్రస్తుతం చెరువులో సంవృద్ధిగా నీరు చేరింది. ఇకనైనా అధికారులు మండల ప్రజలకు తాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలి.

విజయవాడ-విశాఖ మధ్య క్వాడ్రా లైన్

(5వ పేజీ తరువాయి)

ఎదురవుతున్నాయి. ఈ రెండు ప్రాంతాల మధ్యన ఉన్న డిమాండ్‌ను సద్వినియోగం చేసుకోవటానికి వీలుగా అదనంగా మరో రెండు లైన్లను ఏర్పాటు చేయాలని రైల్వే అధికారులు ప్రతిపాదించారు. క్వాడ్రాలైన్ కారణంగా ప్రస్తుతం నడుస్తున్న రైళ్ల సంఖ్యను రెట్టింపు చేయవచ్చు. ప్రస్తుతం 120 నుంచి 240 వరకు రైళ్లను నడపటానికి అవకాశం ఉంటుంది. అదనంగా వేసే రెండు లైన్ల కారణంగా రైళ్లను మరింత వేగంగా నడపటానికి దోహదపడుతుంది. కొత్త ట్రాక్స్, ఆటోమేటిక్ సిగ్నలింగ్ కారణంగా రైళ్లను గంటకు 160 కిలోమీటర్ల వేగంతో పరిగెత్తించటానికి అవకాశం ఉంటుంది.

మరిన్ని వందేభారత్‌లు నడపటానికి దోహదం

విజయవాడ - విశాఖపట్నం మార్గంలో ప్రస్తుతం ఒకే ఒక్క వందే భారత్ రైలు నడుస్తోంది. సికింద్రాబాద్ నుంచి విశాఖకు వెళ్తోంది. వందేభారత్ రైలును వేగంగా నడిపించటం కోసం ఈ మార్గంలో అనేక ఇతర రైళ్లను రద్దు చేయాల్సి వస్తోంది. అదనంగా మరో రెండు లైన్లను ఏర్పాటు చేయటం వల్ల మరిన్ని వందే భారత్ రైళ్లను ఈ మార్గంలో నడిపించటానికి అవకాశం ఏర్పడుతుంది. మిగిలిన రైళ్లను రద్దు చేసే అవసరం కూడా ఉండదు.

బడ్జెట్ కేటాయింపుల తర్వాతే..

ప్రస్తుతం ప్రతిపాదన దశలోనే ఉంది. వచ్చే ఏడాది మొదటి త్రైమాసికంలో ఈ ప్రాజెక్టు సర్వే పూర్తికానుంది. రైల్వే బోర్డుకు నివేదించాక.. కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు చేయాల్సి ఉంటుంది. ఈ మధ్యలో అనేక దశలు ఉంటాయి. 2026వ సంవత్సరం మార్చిలో కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు చేయగలిగితే ఈ ప్రాజెక్టును త్వరగా కార్యరూపంలోకి తీసుకురావటానికి అవకాశం ఉంటుంది. టెండర్లు పిలిచి పనులు ప్రారంభించటానికి ఎంత లేదన్నా.. వచ్చే ఏడాది డిసెంబరు వరకు సమయం పట్టే అవకాశం ఉంది.

ఎన్టీటీపీఎస్‌లో ప్రమాదం

- బ్రాయిలర్ నుంచి ఎగసిపడిన సెగ
- ఏడీఈకు తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన ఏడీఈ శేషుబాబు

ఇబ్రహీంపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ ఎన్టీటీపీఎస్‌లో భద్రతా చర్యల్లో యాజమాన్యం నిర్లక్ష్యం మరోమారు స్పష్టమైంది. గురువారం ప్లాంట్‌లోని స్టేట్-3లో బ్రాయిలర్ వద్ద జరిగిన ప్రమాదంతో విధుల్లో ఉన్న ఏడీఈ శేషుబాబు త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకోగలిగాడు.. అయితే ఒళ్లంతా కాలిపోయింది. బ్రాయిలర్‌ను పరిశీలిస్తుండగా ఒక్కసారిగా డోర్ తెరుచుకోవడంతో ఎగసిపడిన సెగను గమనించిన ఆయన వెనుకకు తిరిగడంతో వీపు మొత్తం కాలిపోయి తీవ్రంగా గాయపడ్డారు. తోటి ఉద్యోగులు వెంటనే స్పందించడంతో ఆయన ప్రాణాలతో బయటపడ్డారు. ఎన్టీటీపీఎస్‌లో తరచుగా జరుగుతున్న ప్రమాదాలతో ఉద్యోగులు, కార్మికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని పనిచేయాల్సిన పరిస్థితి దాపురించింది. గతంలో బ్రాయిలర్ డోర్స్ ఇలానే ఒక్కసారిగా తెరుచుకోవడంతో కార్మికుడి ఒంటిపై వేడి మట్టి పడి తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. మరో కార్మికుడు తీవ్రంగా గాయాలపాలయ్యాడు. ఇటీవల కాలంలో బొగ్గు తీసుకెళ్లే కన్వేయర్ బెల్ట్ కాలిపోయి పెద్ద ప్రమాదం తప్పింది. కాలం చెల్లిన బాయిలర్‌ల వినియోగం వల్ల ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రెషర్ నియంత్రణ పరికరాల నాణ్యతపై కూడా ఉద్యోగులు, కార్మికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

హత్య కేసులో ఏడుగురికి జీవిత ఖైదు

(5వ పేజీ తరువాయి)

కాగిత రామ్మోహనరావు(26)పై అదే గ్రామానికి చెందిన శొంఠి వీరబాబు, శొంఠి పెదపైడేశ్వరరావు, బొర్రా శ్రీనివాసరావు, బొర్రా స్వామికృష్ణ, కాగిత సోమయ్య, శొంఠి వీరవెంకటేశ్వరరావు, శొంఠి వీరాంజనేయులు, శొంఠి మునలయ్య, కాగిత ఆంజనేయులు కక్ష పెంచుకున్నారు. ఈ కేసు 2013 ఫిబ్రవరి 28వ తేదీన విచారణకు వచ్చిన సమయంలో కాగిత రామ్మోహనరావు కోర్టులో తన సాక్ష్యం చెప్పాడు. అదేరోజు రాత్రి గ్రామంలో కాపుకాసిన ఈ తొమ్మిది మంది నిందితులు కాగిత రామ్మోహనరావుపై మారణాయుధాలతో దాడి చేశారు. ఈ దాడిలో గాయపడిన బాధితుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడి సోదరుడు కాగిత రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో మొదటి నిందితుడిగా ఉన్న శొంఠి వీరబాబు, 9వ నిందితుడిగా ఉన్న కాగిత ఆంజనేయులు కేసు విచారణలో ఉండగానే మరణించారు. ఈ కేసులో తొమ్మిది మంది సాక్షులను విచారించారు. ఈ కేసులో ఏడుగురు నిందితులపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

ఉదయం తప్పిపోయారు.. రాత్రికి దొరికారు



తప్పిపోయిన పిల్లలను తల్లికి అప్పగిస్తున్న పోలీసు అధికారులు

విజయవాడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇంటివద్ద ఆడుకుంటున్న చిన్నారులు అకస్మాత్తుగా అదృశ్యమయ్యారు. చుట్టుపక్కల ఎంత గాలించినా ప్రయోజనం లేదు. చివరికి ఆ చిన్నారులను పోలీసులు తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. రామవరప్పాడులోని వంతెన వద్ద ఉంటున్న దుర్గయ్య, మహాలక్ష్మి దంపతులు కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వారికి ఆరేళ్ల బాబు, నాలుగేళ్ల పాప వున్నారు. బాబు రామవరప్పాడు రైల్వేస్టేషన్ సమీపంలోని పాఠశాలలో చదువుతున్నాడు. పాప అంగన్వాడీలో బడిలో చదువుతోంది. అన్నా చెల్లెళ్లు ఇద్దరూ గురువరం ఉదయం ఇంటి నుంచి బయటకు ఆడుకునేందుకు వెళ్లారు. సాయంత్రం వరకూ రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనతో చుట్టుపక్కల వారిని విచారించారు. అయినా ఫలితం లేకపోవడంతో పడమట పోలీసులను ఆశ్రయించారు. దాంతో చిన్నారుల ఫొటోలను పోలీసులు వాట్సాప్ గ్రూపుల్లో పెట్టారు. అయితే ఆ చిన్నారులు రామవరప్పాడు రైల్వేస్టేషన్ వద్ద ఆగిన రైలు ఎక్కి విజయవాడ వెళ్లినట్టు తెలుస్తోంది. తర్వాత అక్కడి నుంచి పాత ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డులో వెళుతుండగా సత్యనారాయణపురం పోలీసులు గుర్తించారు. దాంతో తప్పిపోయిన పిల్లలు వాళ్లేనని పటమట పోలీసులకు సమాచారం ఇచ్చారు. డీసీపీ కృష్ణకాంత్, ఏసీపీ దామోదర్, సీఐ కిషోర్ చిన్నారులను పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

వయోవృద్ధులకు ప్రేమను పంచుదాం



కలెక్టర్ లక్ష్మీశ

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పెద్దరికం ఎన్నటికీ చిన్నబోకూడదని, వయోవృద్ధులకు ఈరోజు మనం ప్రేమ, ఆప్యాయతను పంచితే భవిష్యత్తులో మన పిల్లల నుంచి అవే ఆత్మీయతానురాగాలను పొందుతామని వయోవృద్ధుల సంక్షేమ చట్ట స్ఫూర్తి ట్రిబ్యునళ్ల ఉత్తర్వుల్లో ఉట్టిపడాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. గురువారం కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి వయోవృద్ధుల సంక్షేమ కమిటీ సమావేశం జరిగింది. విజయవాడ, తిరువూరు, నందిగామ రెవెన్యూ డివిజన్లతో పాటు అప్పీలేట్ ట్రిబ్యునల్‌కు వచ్చిన క్లయిమ్‌ల పరిష్కారంతో పాటు వయోవృద్ధుల క్షేమం, సంక్షేమానికి సంబంధించి భవిష్యత్తు కార్యాచరణపై సమావేశంలో చర్చించారు. మొత్తం 433 క్లయిమ్‌లకు ఇప్పటికే 395 క్లయిమ్‌ల పరిష్కారం జరగ్గా, మిగిలిన క్లయిమ్‌ల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

ప్రతి గ్రామంలో లాఫింగ్ క్లబ్‌లు

వయోవృద్ధుల మానసిక ఆరోగ్య పరిరక్షణకు ప్రతి గ్రామంలోనూ లాఫింగ్ క్లబ్‌ల ఏర్పాటుకు చేయూతనివ్వాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో నెలకోసారి సీనియర్ సిటిజన్స్‌తో సమావేశాలు నిర్వహించాలన్నారు. డివిజన్, జిల్లాస్థాయిలోనూ ఇదేవిధమైన చొరవ చూపాలన్నారు. డీసీపీ కేజీవీ సరిత, డీఆర్‌వో ఎం లక్ష్మీనరసింహం, జిల్లా విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్ జెండర్స్, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ వీ కామరాజు, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం సుహాసిని, ఉమ్మడి కృష్ణా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సెక్రటరీ ఎం వెంకటేశ్వరరావు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్‌ల సభ్యులు ఎన్ కామేశ్వరి, రామిరెడ్డి వెంకటేశ్వరరావు, ఎన్ బాలాజీ పాల్గొన్నారు. వర్చువల్‌గా నందిగామ ఆర్డీవో కే బాలకృష్ణ, తిరువూరు ఆర్డీవో కే మాధురి హాజరయ్యారు.

ప్రజా భద్రతలో రాజీ ప్రసక్తే లేదు

ప్రజా భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తూ క్షేత్ర స్థాయి అధికారులు విస్తృత తనిఖీలతో నిరంతర పర్యవేక్షణ తప్పనిసరని, అలసత్వానికి తావులేకుండా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. గురువారం కలెక్టర్ లక్ష్మీశ కలెక్టరేట్ నుంచి ఆర్డీవోలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. శిథిలావస్థ భవనాల విషయంలోనూ నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

చిట్ నిర్వాహకుల ఆస్తుల జప్తునకు రాష్ట్ర హోంశాఖ ఆదేశాలు

(5వ పేజీ తరువాయి)

నిర్వాహకుల ఆస్తులను జప్తు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. దీంతో ఆస్తుల జప్తు అనుమతుల నిమిత్తం రాష్ట్ర హోంమంత్రిత్వ శాఖకు కలెక్టర్ నివేదిక సమర్పించారు. ఈ క్రమంలో గురువారం రాష్ట్ర హోంశాఖ ప్రొటెక్షన్ ఆఫ్ డిపాజిటర్స్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు 1999 ప్రకారం నల్లమోతు ప్రియాంక, భవానీ, రామ్‌గోపాల్ ఆస్తుల అటాచ్ చేస్తూ తదుపరి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసింది. కాగా, రాష్ట్ర హోంశాఖ ఇచ్చిన ఆదేశాల మేరకు కలెక్టర్ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ ముగ్గురు నిందితుల ఆస్తుల అటాచ్‌మెంట్ నిమిత్తం కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారు. న్యాయమూర్తి నిందితుల ఆస్తుల జప్తు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చిన తర్వాత ఆస్తులను వేలంవేసి బాధితులకు చెల్లించే అవకాశాలున్నాయి.

నీటిపై నిఘా

(5వ పేజీ తరువాయి)

ఏఈ, ఈఈలు రైతుల గోడును పట్టించుకోవట్లేదు. కాంట్రాక్టర్లకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. కాంట్రాక్టర్లు ఆడించినట్టు ఇంజనీరింగ్ అధికారులు ఆడుతున్నారు. కృష్ణాజిల్లాలో కేసీ, కేఈ, డ్రెయినేజీ విభాగాల కింద 2024-25, 2025-26 నీటి సంవత్సరాల్లో జరిగిన అభివృద్ధి పనులు లోపభూయిష్టంగా జరిగాయని అధికార పార్టీకి చెందిన నాయకుడు ఒకరు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు స్పందించారు. ఈ రెండు నీటి సంవత్సరాల్లో జరిగిన పనులకు సంబంధించిన టెండర్ల ఫైళ్లు, పనుల ఎగ్జిక్యూషన్ ఫైళ్లు, బిల్లుల వివరాలను సమర్పించాలని ఆదేశించారు. దీనికి సంబంధించి ఈ మూడు డివిజన్లకు విజిలెన్స్ అధికారులు లేఖలు రాశారు.

ఐస్ హాకీ పోటీల విజేత స్కాట్స్‌పైన్

పెనమలూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : డెహ్రాడూన్‌లో జరిగిన ఐస్ హాకీ పోటీల్లో కానూరు స్కాట్స్‌పైన్ పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారని పాఠశాల యాజమాన్యం తెలిపింది. జాతీయ స్థాయి పోటీల్లో ఏపీ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన 8వతరగతి విద్యార్థి అబ్దుల్ సత్తార్, రెండవ తరగతి విద్యార్థిని అబ్దుల్ అఫ్రీన్‌లు బంగారు పతకాలను సాధించినట్లు తెలిపారు. విజేతలను పాఠశాల ఛైర్మన్ వీరమాచనేని వంశీకృష్ణ, డైరెక్టర్ వీరమాచనేని శాంతి, సీఈవో జాహ్నవి కొడాలి, ప్రిన్సిపాల్ ప్రతిమ చలసాని తదితరులు అభినందించారు.



విజేతలతో పాఠశాల యాజమాన్యం

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	246
చికెన్ స్కిన్‌లెస్	256

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 600

జంక్షన్ నుంచి గన్నవరం తరలిన తెలుగు తమ్ముళ్లు



హనుమాన్‌జంక్షన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బాపులపాడు మండలం నుంచి ఎన్నికైన టీడీపీ కమిటీల నాయకులు జంక్షన్ సెంటర్ నుంచి ర్యాలీగా గురువారం గన్నవరం తరలి వెళ్లారు. ర్యాలీని దయాల రాజేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. దీనికి ముందు స్థానిక అభయాంజనేయస్వామి దేవస్థానంలో నాయకులు పూజలు నిర్వహించారు. పార్టీ నేతలు గుండప నే ని ఉమా వరప్రసాద్, వేగిరెడ్డి పాపారావు, మూల్పూరి సాయి కల్యాణి, నాయకులు అట్లూరి శ్రీనివాస రావు, మొవ్వా వేణు గోపాల్, చిన్నాల లక్ష్మీనారాయణ, గారపాటి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, టీడీపీ మండల అధ్యక్షుడు గూడపాటి తులసిమోహన్

పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ
- యార్లగడ్డ నేతృత్వంలోనే గన్నవరం అభివృద్ధి

గన్నవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కోసం పనిచేసిన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ అన్నారు. దానికి ఉదాహరణ తానేనని తెలిపారు. నియోజకవర్గ నూతన కమిటీల ప్రమాణ స్వీకారోత్సవం గురువారం రాత్రి స్థానిక రోటరీ ఆడిటోరియంలో నిర్వహించారు. నియోజకవర్గ పరిశీలకులు వల్లూణం హరిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేకు కట్ చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. సభకు అధ్యక్షత వహించిన హరిబాబు మాట్లాడుతూ, కష్టపడిన కార్యకర్తలకు ఎల్లప్పుడూ గుర్తింపు ఇస్తున్న విషయం ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణని చూస్తే అర్థమవుతుందన్నారు. సాధారణ కార్యకర్త స్థాయి నుంచి ఎంపీగా పనిచేసిన ఆయన ప్రస్తుతం ఆర్టీసీ చైర్మన్‌గా సేవలందిస్తున్నారని తెలిపారు. గత ఐదేళ్ల అరాచక పాలనకు ముగింపు పలికిన ప్రజలు కూటమి ప్రభుత్వానికి అఖండ మెజార్టీ చేకూర్చారని వివరించారు. నియోజకవర్గంలోని 85 పంచాయతీలలో పూర్తిస్థాయి పార్టీ కమిటీలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఎల్లప్పుడూ కార్యకర్తలకు అండగా ఉంటారని చెప్పారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, గన్నవరంలో అరాచకాలకు చరమగీతం పాడి అభివృద్ధికి ప్రజలు పట్టం కట్టారని ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేసి గన్నవరాన్ని రాష్ట్రంలోని మొదటి స్థానంలో నిలబెడతానని భరోసా ఇచ్చారు. ఎన్నికల సమయంలో తాను ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నట్లు తెలిపారు. గన్నవరం, ఉంగుటూరు మండలాల్లో తెలుగుదేశం పార్టీని మరింత పటిష్ట పరచాల్సిన అవసరం ఉందని యార్లగడ్డ అభిప్రాయపడ్డారు. కొనకళ్ల మాట్లాడుతూ, నియోజకవర్గానికి టీడీపీ కంచుకోటని, ఈ నియోజకవర్గ ప్రజలు తనను రెండు సార్లు ఎంపీగా గెలిపించారని గుర్తు చేసుకున్నారు. ఎమ్మెల్యే వెంకట్రావు డబ్బు సంపాదన కోసం రాజకీయాల్లోకి రాలేదని ప్రజాసేవ చేయాలనే ఏకైక లక్ష్యంతో రాజకీయాల్లోకి వచ్చిన ఆయన నియోజకవర్గ ప్రజల అభిమానాన్ని చూరగొని భారీ మెజార్టీతో విజయం సాధించారని పేర్కొన్నారు. కష్టపడి పైకి వచ్చిన యార్లగడ్డకు ప్రజా సమస్యలు తెలుసని ఆయన నేతృత్వంలో నియోజకవర్గం రాష్ట్రంలోనే మొదటి స్థానం చేరుకుంటుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు అందరూ సమష్టిగా పనిచేసి స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల టీడీపీ అధ్యక్షులు గూడపాటి తులసి మోహన్, దయాల రాజేశ్వరరావు, గొడ్డళ్ల చిన్న రామారావు, కొలుసు రవీంద్ర, మండల కార్యదర్శులు బోడపాటి రవి, పుట్టా సురేష్, కుందేటి చంద్రశేఖర్, కోనేరు సందీప్‌తో పాటు అనుబంధ కమిటీలు బూత్ కన్వీనర్లు, క్లస్టర్ ఇంచార్జిలతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, చిరుమామిళ్ల సూర్యం, దొంతు చిన్న, జాస్తి శ్రీధర్, కాసన్నేని రంగబాబు, మేడేపల్లి రమ, ఆళ్ల దమయంతి, అన్నే హరికృష్ణ, ఆళ్ల గోపాలకృష్ణ, జొన్నలగడ్డ సుధాకర్, కోనేరు నాని, బొప్పన హరికృష్ణ, ముల్పూరి సాయి కళ్యాణి, బోడపాటి రవి, బుస్సే నాగ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే యార్లగడ్డ ఆదేశాలతో రహదారికి మరమ్మతులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : గుంతలతో అధ్వానంగా మారిన రామన్నగూడెం ప్రధాన రహదారికి ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాలతో మరమ్మతులు నిర్వహించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఎంఎన్‌కే రహదారి నుంచి రామన్నగూడెం వెళ్లే రహదారి కొన్నేళ్లుగా పట్టించుకోకపోవడం, గత నెల కురిసిన వర్షాలకు భారీ గుంతలు పడి ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు కూడా ఇబ్బంది పడటంతో స్థానిక నాయకులు డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్ ద్వారా ఎమ్మెల్యే యార్లగడ్డ దృష్టికి తీసుకువెళ్లారు. తక్షణం స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి తాత్కాలిక మరమ్మతులు చేయాలని ఆదేశాలిచ్చారు. కొమ్మారెడ్డి రాజేష్ ఆధ్వర్యంలో గ్రావెల్ లారీలు, జెసీబీతో గురువారం ఉదయం పనులు మొదలు పెట్టి తాత్కాలిక మరమ్మతులు చేయించారు. సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే యార్లగడ్డకు రామన్నగూడెం ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు



గన్నవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని వాటిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు నర్రా సీతారామారావు, పుణ్యచారిటీస్ కార్యదర్శి జాస్తి విజయభూషణ్ కుమార్ అన్నారు. గురువారం స్థానిక గ్రేడ్-1 గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. కమిటీ సభ్యులు గన్నె వెంకట్రావు, సూరిబోయిన రాంబాబు, పడమట శోభారాణి, బి.ఝాన్సీ రాణి, కంభంపాటి ధర్మారావు, లైబ్రేరియన్ కె.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అడ్డగోలు పార్కింగ్‌తో ప్రమాదాలు

● భారీ వాహనాలకు హైవేల పక్కన ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలు ● నిబంధనలను పట్టించుకోని డ్రైవర్లు ● సాయంత్రమైతే ప్రధాన రోడ్లపై ట్రావెల్ బస్సుల ఇష్టారాజ్యం
● నగరంలోని తాడిగడప- కానూరు రోడ్డులో అడ్డగోలు పార్కింగ్‌లు ● ఈ రోడ్డులో పార్క్ చేసేవన్నీ లారీలు, బస్సులే


జాతీయ రహదారిపై ఉన్న ఎస్ఆర్కే ఇంజనీరింగ్ కళాశాల వద్ద...


ప్రసాదంపాడు వద్ద జాతీయ రహదారిపై..

విజయవాడ, ఆంధ్రజ్యోతి: విజయవాడ నగరంలోని రహదారులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. దీనికి తోడు అడ్డగోలు పార్కింగ్‌తో వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. లారీలు, ట్రావెల్ బస్సులు, భారీ వాహనాల అక్రమపార్కింగ్‌లు ట్రాఫిక్‌తో పాటు ప్రమాదాలకూ కారణమవుతున్నాయి. నగరంలో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు ఈ పార్కింగ్‌లే ప్రధాన సమస్య. పోలీసులు నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటుచేసినా తమకేమీ కనిపించనట్టు వ్యవహరిస్తున్నారు. ఎన్-16పై రామవరప్పాడు రింగ్ నుంచి ఎనికేపాడు వరకు ఇలాంటి చిత్రాలే కనిపిస్తాయి. హైవేలపై ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేస్తే భారీ ప్రమాదాలు జరుగుతాయని తెలిసినా డ్రైవర్లు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. హైవే అధికారులు వాటికంటూ ప్రత్యేక పార్కింగ్ స్థలాలు కేటాయించినా డ్రైవర్లు మాత్రం తమకు నచ్చిన చోట నిలిపివేస్తూ ట్రాఫిక్‌కు, ప్రమాదాలకు కారకులవుతున్నారు. భారీ వాహనాలు రోడ్డుపై నిలిపేటప్పుడు వెనుక నుంచి మరో వాహనం దాన్ని ఢీకొట్టిన సందర్భాలూ ఉన్నాయి. కేవలం ఈ ప్రాంతంలోనే కాకుండా బెంజిసర్కిల్ ఫ్లై ఓవర్ కింద సర్వీస్ రోడ్డులో ట్రావెల్స్ సంస్థల ఆఫీసులుండడంతో మధ్యాహ్నం నుంచి సంస్థలకు చెందిన బస్సులను ప్రధాన రహదారిపైనే నిలిపేస్తున్నారు. బెంజిసర్కిల్ నుంచి ఆటోనగర్ వెళ్లే రోడ్డు, ప్రభుత్వాసుపత్రి సర్వీస్ రోడ్, పీఎన్‌బీఎస్-ఏలూరు రోడ్డులో కేశినేని చిన్ని పార్టీ ఆఫీస్, పోలీస్ స్టేషన్ వద్ద, రామవరప్పాడు రింగ్, పున్నమిఘాట్ ఎదురుగా పీఎన్‌బీస్ వద్ద ఇదే పరిస్థితి. సాయంత్రమైతే ట్రావెల్ బస్సులు గంటల తరబడి నిలిపివేస్తున్నారు. ఈరోడ్లన్నీ ప్రధాన రహదారులే కావడంతో ఒక్కో సందర్భాల్లో గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఏదైనా సంఘటన జరిగినప్పుడు మాత్రమే అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు, చర్యలకు ఉపక్రమిస్తారు. కొన్ని రోజుల తర్వాత దోస్తీకి చేతులు చాపుతారనే ఆరోపణలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.


తాడిగడప 100 అడుగుల రోడ్‌లో..

లారీలతో నిండిపోయిన తాడిగడప- కానూరు రోడ్డు

ఎనికేపాడు వద్ద హైవేకు ఆనుకుని ఉన్న తాడిగడప-కానూరు రోడ్డు లారీలు, ట్రావెల్ బస్సులతో నిండిపోయింది. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిపి ఉంచడంతో ఇరుకుగా మారింది. ఏవైనా రెండు వాహనాలు ఎదురెదుగా వస్తే కదలలేని పరిస్థితి. సర్వీసు రోడ్డులో వాహనాలకు అధిక సమయం పార్కింగ్ చేసుకోవడానికి అనుమతులుండవు. కానీ ఈరోడ్డులో మాత్రం రోజుల తరబడి పార్కింగ్ చేసి ఉంటున్నాయి. రోడ్డుకిరువైపులా లారీలు, ట్రావెల్స్ ఆగి ఉండడంతో దుమ్ము, ధూళి పేరుకుపోయి వాహనదారులకు ఇబ్బందిగా మారుతోంది. వర్షాకాలంలో పార్కింగ్ వల్ల బురదగా మారి రోడ్డపక్కన పగుళ్లు వస్తున్నాయి. పెద్ద వాహనాల వెనుక సాధారణ వాహనదారులు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపక్కన పార్కింగ్ చేసిన వాహనాలను తొలగించే చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు వేడుకుంటున్నారు.

ప్రభుత్వాసుపత్రి సర్వీస్ రోడ్‌లో..

ఏలూరు రోడ్‌లోని కొత్త ప్రభుత్వాసుపత్రి సర్వీస్ రోడ్‌లో వాహనాలు రెండు పక్కలా పార్కింగ్ చేయడంతో రోడ్డు మొత్తం కుచించుకుపోయి నడకదారి కంటే అధ్వాన్నంగా తయారైంది. ఈ రోడ్‌లో ఆసుపత్రికి వెళ్లే అంబులెన్స్‌లు ఎక్కువగా ఉంటాయి. ప్రధాన రహదారిలో ఏదైనా ట్రాఫిక్ జామ్ అయితే ఈ సర్వీస్‌రోడ్ గుండానే అంబులెన్స్‌లు వెళ్లాల్సి ఉంటుంది. కానీ ఈ సర్వీస్ రోడ్‌లో మాత్రం అలా వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని రోగులు, వారి బంధువులు కోరుతున్నారు.

నరసాపూర్ వరకు వందేభారత్ రైలు పొడిగింపు

రైల్వేస్టేషన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ - విజయవాడ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నరసాపూర్ వరకు పొడిగించినట్టు విజయవాడ రైల్వే డివిజన్ పీఆర్‌వో నుస్రత్ ఎం మండ్రూపకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 20677, 20678 వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 12 నుంచి నరసాపూర్ వరకు పొడిగించినట్లు ఆమె ఈ ప్రకటనలో తెలిపారు. 20677 డాక్టర్ ఎంజీఆర్ చెన్నై సెంట్రల్‌లో ఉదయం 5.30 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 2.10 గంటలకు నరసాపూర్ చేరుకుంటుంది. రేణిగుంట, నెల్లూరు, ఒంగోలు, తెనాలి, విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్ మీదుగా నరసాపూర్ వెళుతుంది. తిరుగు ప్రయాణంలో 20678 నరసాపూర్ నుంచి మధ్యాహ్నం 2.50 గంటలకు బయలుదేరి రాత్రి 11.45కు ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది.

రేపు కలెక్టరేట్‌లో జాబ్‌మేళా

కలెక్టరేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వికాస ఆధ్వర్యంలో ఈ నెల 15న శనివారం కలెక్టరేట్‌లోని ఎన్టీఆర్ వికాస కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కే లచ్చారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో సదర్లాండ్, టెక్నోటాస్క్ కంపెనీల్లో కస్టమర్ సపోర్ట్ అసోసియేట్ (నాన్ వాయిస్ & చాట్ ప్రోసెస్) ఉద్యోగానికి బీటెక్ ఆల్ స్ట్రీమ్స్, ఏదైనా డిగ్రీ, ఎంసీఏ, బీసీఏ, బీఎస్సీ, ఏదైనా పీజీ 2019 నుంచి 2025లో ఉత్తీర్ణులైన ఫ్రెషర్ & ఎక్స్‌పీరియన్స్ అభ్యర్థులు అర్హులు. ఈ ఉద్యోగానికి ఎంపికైన వారికి నెలకు రూ.24వేల నుంచి రూ.30వేల జీతం ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులందరూ 15న శనివారం ఎన్టీఆర్ వికాస కార్యాలయం, కలెక్టరేట్, విజయవాడ వద్ద ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్స్ జిరాక్స్‌లతో హాజరుకావాలన్నారు. వివరాలకు 9154557779, 9154667779లో సంప్రదించాలని కోరారు.

ఆర్ఎస్‌కేలను సద్వినియోగం చేసుకోవాలి

● కలెక్టర్ బాలాజీ


గూడూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

గూడూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసకోవాలని, పక్వానికి రాకుండానే వరి పైరును కోయరాదని కలెక్టర్ బాలాజీ రైతులను కోరారు. గురువారం ఆయన గూడూరు మండలంలో విస్తృతంగా పర్యటించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు, వరి పైరు, తేమశాతం పరీక్షించే పరికరాలను పరిశీలించారు. తొలుత ఆయన మండల కేంద్రమైన గూడూరు, కంకటావ, ఆకులమన్నాడు గ్రామాల్లో పర్యటించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి వ్యవసాయాధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో వరికోతలు ఎక్కువై ధాన్యం ఎక్కువగా వస్తే సామర్థ్యానికి మించి వస్తే ముందుగానే ఇతర మిల్లులతో మాట్లాడి సిద్ధంగా ఉండాలన్నారు. గత ఏడాది కొంతమంది రైతులు తమ పక్కనున్న వరిపైరును యంత్రాలతో కోస్తుంటే పక్వానికి రాకుండానే మరి కొంతమంది రైతులు పంటను కోశారన్నారు. ఈసారి అలా పక్వానికి రాని వరిపైరును తొందరపడి కోయరాదని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎండలు బాగా ఉన్నందున రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకుని ప్రభుత్వ నిబంధన ప్రకారం తేమశాతం 17 ఉండేటట్టు చూసుకుని తీసుకురావాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ పద్మావతి, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శివరామప్రసాద్, వ్యవసాయ శాఖ ఏడీలు మణిధర్ రమాదేవి, గూడూరు తహసీల్దార్ డీ రాజ్యలక్ష్మి, ఏవో శివరామకృష్ణ, అధికారులు, పలువురు రైతులు పాల్గొన్నారు. తొలుత కలెక్టర్ కంకటావలో దెబ్బతిన్న ఎలకుర్రు మురికి కాలువ వంతెనను పరిశీలించారు. వంతెన బాగు చేయించాలని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా స్పందించిన కలెక్టర్ చర్యలు తీసుకుంటామన్నారు.

పరమశివుడి ఎదుట దీపాలతో విశేష ఫలితం

● రాధామనోహర్ దాస్ అభిభాషణ
● కోటి దీపార్చనలో పాల్గొన్న భక్తులు



మచిలీపట్నం టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వేలాది మంది భక్తుల నామస్మరణతో గురువారం రాత్రి రామలింగేశ్వర స్వామి దేవాలయం వద్ద 3,600 మంది భక్తులు కోటి దీపార్చనలో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త దేసు నీరజ, కార్యనిర్వహణాధికారి సమ్మెట ఆంజనేయ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కోటిదీపోత్సవం ప్రముఖ ఆధ్యాత్మికవేత్త రాధామనోహర్‌దాస్ ప్రారంభించారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదైన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం ఒక వినూత్న రీతిని సంతరించుకుంది. 35 అడుగుల ఎత్తైన పరమశివుడి విగ్రహం ఎదుట నిర్వహించిన ఈ దీపార్చనలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీతో ఆలయ ప్రాంగణం సందడిగా నెలకొంది. ఈ సందర్భంగా రాధామనోహర్‌దాస్ మాట్లాడుతూ పరమేశ్వరుని అనుగ్రహం పొందేందుకు కార్తీకమాసంలో అభిషేకాలు, అర్చనలు, దీపారాధనలు చేయడం వల్ల విశేష ఫలితాలు ఉంటాయన్నారు. హిందూ దేవాలయాల్లో ఆధ్యాత్మిక చింతన నెలకొల్పేందుకు దేవాలయాల ధర్మకర్తలు, కార్యనిర్వహణాధికారులు, ఆధ్యాత్మిక వేత్తలు, అర్చకులు కృషి చేయాలన్నారు. తొలుత రాధామనోహర్‌దాస్‌కు దేవస్థాన పాలకవర్గ ప్రతినిధులు దేసు నీరజ, దేసు సుబ్రహ్మణ్యం, కార్యనిర్వహణాధికారి ఆంజనేయ స్వామితో పాటు బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పీవీ ఫణికుమార్ స్వాగతం పలికారు. కార్పొరేటర్లు మరకాని సమతాకీర్తి, దింటకుర్తి సుధాకర్, అన్నం ఆనంద్, న్యాయవాది లంకిశెట్టి బాలాజీ పాల్గొన్నారు. కోటి దీపోత్సవంలో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది.



తవ్వకాలు జరిపిన నున్న కోసుకోండ ప్రాంతం, పోలీసులు అదుపులోకి తీసుకున్న ట్రాక్టర్లు

నున్నలో అక్రమ తవ్వకాలు

● నాలుగు ట్రాక్టర్లు, నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

విజయవాడ రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నున్న గ్రామంలో యథేశ్చగా మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. అర్ధరాత్రిళ్లు గుట్టుచప్పుడు కాకుండా అక్రమార్కులు మట్టిని తరలిస్తున్నారు. కొన్నిరోజులుగా జరుగుతున్న ఈ తవ్వకాలపై స్థానికుల నుంచి సమాచారం అందుకున్న నున్న రూరల్ పోలీసులు గురువారం తెల్లవారుజామున ఆకస్మిక దాడులు జరిపారు. అక్రమంగా మట్టిని తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లతో పాటు నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. నున్న వికాస్ కాలేజీ రోడ్డులోని జనగన్న కాలనీ సమీపంలోని కోసుకొండ ప్రాంతంలో కొన్నిరోజులుగా అక్రమ మైనింగ్ జరుగుతుండటంపై నున్న రూరల్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో గురువారం తెల్లవారుజామున ఆ ప్రాంతానికి వెళ్లిన పోలీసులు అక్రమంగా మట్టి తరలిస్తున్న ఏపీ 39 ఎన్ఎస్ 3502, ఏపీ 16 టీజీ 9247, ఏపీ 16 టీఎస్ 7492, ఏపీ 39 యూ5069 నెంబరు గల నాలుగు ట్రాక్టర్లను స్వాధీన పరచుకున్నారు. అలాగే ట్రాక్టర్లలో మట్టిని తరలిస్తున్న నలుగురు డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. కాగా పోలీసుల ఆకస్మిక దాడులతో కోసుకోండ వద్ద మైనింగ్ జరుపుతున్న వ్యక్తులు పరారయ్యారు.

అటవీ శాఖ సిబ్బందిపై అనుమానాలు

కోసుకోండ ప్రాంతంలో జరుగుతున్న అక్రమ మైనింగ్ వ్యవహారంలో అటవీ శాఖలో పనిచేస్తున్న ఇద్దరు కిందస్థాయి సిబ్బందిపై గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సదరు సిబ్బంది కొన్నిరోజులుగా ఇతర గ్రామాల నుంచి ట్రాక్టర్లు, మిషన్లు తెప్పించి తవ్వకాలు జరుపుతున్నారని ఆరోపిస్తున్నారు. ట్రాక్టర్‌కు రూ.300 చప్పున మట్టి మాఫియా నుంచి వసూళ్లు చేసి సొమ్ము చేసుకుంటున్నారని తెలుస్తుంది. అధికారులు విచారణ జరిపి ట్రాక్టర్ల డ్రైవర్లతో పాటుగా మట్టి తరలింపు వ్యవహారంలోని వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆధునిక సాంకేతికతతో వీఎంసీలో విధులు

● ట్రైనీ ఐఏఎస్‌లతో ఇన్‌చార్జి కమిషనర్ చంద్రశేఖర్

కార్పొరేషన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతికతతో విజయవాడ నగరపాలక సంస్థ విధులు నిర్వహిస్తోందని ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డీ చంద్రశేఖర్ అన్నారు. ఉత్తరాఖండ్ ముస్సోరిలోని లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అడ్మినిస్ట్రేషన్‌లో శిక్షణ పొందుతున్న 20 మంది ఆలిండియా సర్వీసెస్ ఆఫీసర్లకు గురువారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో వీఎంసీ పనితీరును ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డీ చంద్రశేఖర్ వివరించారు. వీఎంసీ భౌగోళిక విషయాలు, ఎన్ని విభాగాలున్నాయి, వాటి పనితీరు వివరించారు. ప్రతి విభాగం శాఖాధిపతి తమ తమ విభాగంలో చేస్తున్న పనులు, సిబ్బంది నిర్వహిస్తున్న విధులును వివరించారు. ఆధునిక సాంకేతికతతో చేస్తున్న పనితీరు, ఉపయోగించే డ్రోన్ల విధానం వివరించారు. అనంతరం వారు హెచ్‌బీ కాలనీలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు వెళ్లి అక్కడ డాక్టర్లు నిర్వహిస్తున్న విధులు ప్రజలకు అందిస్తున్న చికిత్సలను తెలుసుకున్నారు. గవర్నర్‌పేట సీవీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి, అక్కడున్న ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి విద్యాబోధన గురించి తెలుసుకున్నారు. అడిషనల్ కమిషనర్ (జనరల్) ఏ రవీంద్రరావు, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కే అర్జునరావు, చీఫ్ సిటీ ప్లానర్ కే సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజనీర్ ఇన్‌చార్జి వీ సత్యకుమారి, జాయింట్ డైరెక్టర్ (అమృత్) డాక్టర్ లత, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీ డీ) పీ వెంకటనారాయణ, సెక్రటరీ ఇన్‌చార్జి కే ప్రభుదాస్, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, ఎస్టేట్ ఆఫీసర్ ఏ శ్రీధర్, డీఎఫ్‌వో మాల్యాద్రి పాల్గొన్నారు.


చిత్రాన్ని తిలకిస్తున్న అనాథ బాలబాలికలతో 'రౌండ్‌టేబుల్' సభ్యులు

అనాథ బాలబాలికలకు చిత్ర ప్రదర్శన

లబ్బీపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని రౌండ్ టేబుల్ ఇండియా, అమరావతి రౌండ్ టేబుల్, విజయవాడ రౌండ్ టేబుల్, సినీ పోలీస్ సంయుక్త ఆధ్వర్యంలో అనాథ బాలబాలికలకు మహదేవ్ చిత్రాన్ని ప్రదర్శించారు. నాలుగేళ్లుగా బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలల చిత్రాలను ప్రదర్శిస్తున్నామని అమరావతి లేడీస్ సర్కిల్ ఛైర్ పర్సన్ అందలం సింధు, విజయవాడ రౌండ్ టేబుల్ మాజీ ఛైర్‌పర్సన్ అశ్విని తెలిపారు. ఈ ప్రదర్శనకు సుమారు 250 మంది అనాథ బాలబాలికలు విచ్చేయగా, రౌండ్ టేబుల్ ఇండియా ఏరియా ఛైర్ పర్సన్ దీప శర్మ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 20 వేల మంది అనాథ బాలబాలికలకు సినీ పోలీస్ సహకారంతో చిత్రాన్ని ప్రదర్శించినట్టు తెలిపారు. విజయవాడ లేడీస్ సర్కిల్ ఛైర్‌పర్సన్ అలేఖ్య కాట్రగడ్డ, సినీ పోలీస్ యూనిట్ హెడ్ మురళీకృష్ణ పాల్గొన్నారు.


హెల్త్ డైరెక్టర్‌తో మాట్లాడుతున్న ఏపీఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విద్యాసాగర్, డీవీ రమణ తదితరులు

హెల్త్ అసిస్టెంట్లకు పదోన్నతులివ్వండి

● ఎన్జీజీవో అధ్యక్షుడు విద్యాసాగర్

విజయవాడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్స్‌కు హెల్త్ సూపర్‌వైజర్స్‌గా పదోన్నతలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఏ విద్యాసాగర్, డీవీ రమణ వైద్యారోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి దృష్టికి తీసుకెళ్లారు. నగరంలోని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయంలో గురువారం ఈ విషయమై ఆమెతో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల పదోన్నతల విషయంపై చర్యలు తీసుకోవాలని కోరారు. హెల్త్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన జోన్-3లో పెండింగ్‌లో ఉన్న హెల్త్ అసిస్టెంట్‌లకు సూపర్‌వైజర్లుగా పదోన్నతలు కల్పించే విషయం ఇప్పటికే ఆలస్యమైందని, ఉద్యోగులు పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. డాక్టర్ పద్మావతి స్పందిస్తూ సాధ్యమైనంత త్వరతో పదోన్నతల విషయంపై చర్యలు తీసుకుంటామన్నారు. డైరెక్టర్‌ను కలిసినవారిలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ షరీఫ్, బండారుపల్లి వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాస్, విజయవాడ సిటీ అధ్యక్షుడు చిగులూరి సీవీఆర్ ప్రసాద్ ఉన్నారు.


ఏపీ వక్ఫ్ బోర్డ్ సీఈవో మొహమ్మద్ అలీకి వినతి పత్రం అందజేస్తున్న జమాతుల్ ప్రతినిధి బృందం

ఉమీద్ పోర్టల్‌లో సాంకేతిక సమస్యలు

● జమాతులు ప్రతినిధి బృందం

లబ్బీపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉమీద్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడానికి ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యలను ఏపీ ముస్లీం జేఏసీ ఆధ్వర్యంలో గురువారం వివిధ జమాతుల్ ప్రతినిధి బృందం వన్‌టౌన్ వక్ఫ్ కార్యాలయంలోని ఏపీ వక్ఫ్ బోర్డ్ సీఈవో మొహమ్మద్ అలీ దృష్టికి తీసుకువెళ్లడంతో పాటు వినతిపత్రం సమర్పించారు. ముస్లిం జేఏసీ కన్వీనర్ మునీర్ అహ్మద్ మాట్లాడుతూ వక్ఫ్ సంస్థలను ఉమీద్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడానికి డిసెంబరు 5న చివరి తేదీగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని, పోర్టల్‌లో అనేక సమస్యలు, లోపాలున్నాయన్నారు. దీంతో ఆస్తుల నమోదు ప్రక్రియ ఆలస్యం అవుతుందని, నమోదుకు ప్రయత్నించిన ప్రతి సందర్భంలోనూ సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయన్నాయన్నారు. ఈ సమస్యల కారణంగా అనుకున్న తేదీల్లో వక్ఫ్ ఆస్తులను అప్లోడ్ చేయడం అసాధ్యమని, సాంకేతిక లోపాలన్నింటినీ గుర్తించి సత్వర దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని సీఈవో కోరినట్టు వారు తెలిపారు. న్యాయవాది అబ్దుల్ మతిన్, ముస్లిం సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముక్తార్ అలీ, ముఫ్తి యూసుఫ్ సాబ్, నసీర్ ఉమ్రి, ముఫ్తీ హబీబ్ పాల్గొన్నారు.


పతకాలు సాధించిన క్రీడాకారులతో శాప్ ఛైర్మన్ రవినాయుడు

జిమ్నాస్టిక్ క్రీడాకారులకు శాప్ ఛైర్మన్ అభినందన

విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు 8 నుంచి 11 వరకు డెహ్రాడూన్‌లో జరిగిన అక్రోబాటిక్స్ అండ్ ట్రాంపోలిన్ జిమ్నాస్టిక్స్ జాతీయ చాంపియన్‌షిప్‌లో రాష్ట్రానికి చెందిన జిమ్నాస్టిక్స్ క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి 7 రజత, 3 కాంస్య పతకాలు సాధించడంపై శాప్ ఛైర్మన్ రవినాయుడు హర్షం వ్యక్తం చేస్తూ క్రీడాకారులను అభినందించారు. గురువారం శాప్ కార్యాలయంలో జిమ్నాస్టిక్స్ క్రీడాకారులు మర్యాదపూర్వకంగా శాప్ ఛైర్మన్ కలిసి సాధించిన పతకాలు చాంపియన్‌షిప్ వివరాలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రానికి పేరు తేవాలని ఆకాంక్షించారు. రాష్ట్ర జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ సభ్యులు, గుంటూరు డీఎస్డీవో అఫ్రోజ్ ఖాన్ పాల్గొన్నారు.

మా ధాన్యం కొనండి.. మహాప్రభో..!

● వరిగింజ బాగున్నా తడిసిందంటూ కొనటం లేదని రైతుల ఆవేదన ● ఆర్ఎస్‌కే లోనైనా కొనాలంటూ అభ్యర్థన


తడిసిన వరి ధాన్యాన్ని చూపుతున్న అనిగండ్లపాడు రైతులు

పెనుగంచిప్రోలు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా మైసమ్మ గండి ద్వారా ప్రవహించిన వరద నీటితో మండలంలోని పెనుగంచిప్రోలు, ముచ్చింతల, గుమ్మడిదూరు, అనిగండ్లపాడు వత్సవాయి, మండలంలోని పాతవేమవరం గ్రామాలకు చెందిన వరి పొలాలు కొద్దిరోజులపాటు నీటిలోనే ఉండిపోయాయి. ఆరిన తరువాత గుమ్మడిదూరు, అనిగండ్లపాడు గ్రామాలకు చెందిన రైతులు వరి కోతలు కోశారు. ధాన్యాన్ని అమ్ముకుందామని మిల్లర్ల వద్దకు వెళ్లగా ధాన్యం తడిసింది కావున కొనలేమని ఖరాకండిగా చెబుతున్నారు. ప్రభుత్వం సొసైటీల వద్ద తడిసిన వరి ధాన్యాన్ని తీసుకువెళ్లగా ఈ ధాన్యాన్ని కొనడానికి పై నుంచి అధికారులు అనుమతి లేదని సిబ్బంది చెబుతున్నారు. ధాన్యం తడిసిన మాట వాస్తవమేనని బియ్యం గింజ మాత్రం మంచిగానే ఉన్నప్పటికీ తడిసిందనే సాకుతో వ్యాపారులు ధాన్యాన్ని కొనటానికి ముందుకు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వరదలు రాకుండా ఉంటే ఎకరానికి 35 నుంచి 40 బస్తాల దిగుబడి వచ్చేదని ఈ వరదల కారణంగా ఎకరానికి సుమారు 20 బస్తాల ధాన్యం మాత్రమే వచ్చిందని అనిగండ్లపాడు గ్రామానికి చెందిన బాధిత రైతులు మొదలు కృష్ణ శేషు, ఓల్లంకొండ భాస్కర్‌రావు ఆవేదన వెళ్లిబుచ్చారు. గుమ్మడిదూరు, అనిగండ్లపాడు గ్రామాలకు చెందిన సుమారు 500 ఎకరాలు తడిసిన ధాన్యం పేరుతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా అధికారుల, ప్రజాప్రతినిధులు స్పందించి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కృష్ణశేషు భాస్కర్‌రావు విజ్ఞప్తి చేస్తున్నారు.



మల్లేశ్వరాలయ ప్రాంగణం, కొండదిగువన పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న చైర్మన్, ఈవో

భవానీ భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయండి

» చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో భవానీదీక్ష విరమణల సందర్భంగా ఆలయానికి వచ్చే భవానీలకు ఎటువంటి ఇబ్బందులు, అసౌకర్యం లేకుండా భద్రతా చర్యలు చేపట్టాలని చైర్మన్ బి.రాధాకృష్ణ, ఈవో వీకే శీనానాయక్‌లు ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. భవానీదీక్షల విరమణలను పురస్కరించుకుని గురువారం ఈవో మహామండపంలోని ఇంజనీరింగ్ అధికారులు, ఏఈఈవోలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భవానీలకు చేపట్టిన ఏర్పాట్లపై ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్నానఘట్టాలు, భవానీ దర్శన ఏర్పాట్లు, క్యూలు, ఇరుముడి సమర్పణ పాయింట్లు, హోమగుండాలు, టెంకాయలు కొట్టే ప్రదేశాలు, అన్న ప్రసాదం పంపిణీ, లడ్డూ ప్రసాదం కౌంటర్లు, భక్తులు బయటకు వెళ్లే మార్గాలు, ఇతర అంశాలపై ఇంజనీరింగ్ అధికారులు, ఏఈవోలను అడిగి తెలుసుకున్నారు. భవానీలకు భద్రతా ఏర్పాట్లలో నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. అనంతరం మహామండప ప్రాంగణం, కనకదుర్గానగర్, శివాలయం తదితర ప్రాంతాల్లో పర్యటించి ఏర్పాట్లపై ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. భవానీలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున హోమగుండాలు, ఇరుముడి సమర్పణ పాయింట్ల వద్ద గట్టి భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఈఈ-1 కోటేశ్వరరావు, ఈఈ-2 రాంబాబు, ఏసీ రంగారావు, దాత సంగా నరసింహారావు, ఏఈవోలు బి.వెంకటరెడ్డి, ఎన్.చంద్రశేఖర్, పి.సుధారాణి, ఎస్.రమేష్‌బాబు, ఎం.ఎస్.ఎల్.శ్రీనివాస్, కె.గంగాధర్ పాల్గొన్నారు.

క్యూలో వెళ్లమంటే చేయిచేసుకున్నారు

» సెక్యూరిటీ గార్డుపై మహిళా భక్తుల దురుసుతనం

ఇంద్రకీలాద్రి : దుర్గామల్లేశ్వర దేవస్థానం మహామండపం దిగువన పలువురు మహిళా భక్తులు ఎదురుగా లోపలికి వెళుతుండగా అడ్డుకున్న సెక్యూరిటీ గార్డుతో గొడవపడి అతనిపై చేయిచేసుకున్న సంఘటన గురువారం జరిగింది. నగరానికి చెందిన ఆరుగురు మహిళా భక్తులు అమ్మవారి దర్శనానికి దుర్గగుడికి వెళ్లారు. గుడి దిగువన సెల్‌ఫోన్‌లు తనిఖీ చేసే గేటు వద్ద భక్తులు ఎదురుగా లోపలికి వెళుతుండగా అక్కడే ఉన్న సెక్యూరిటీ గార్డు వారిని అడ్డుకుని క్యూలో వెళ్లాలని సూచించాడు. సెక్యూరిటీ గార్డు ఎంత చెప్పినప్పిటికీ వారు వినకపోవటంతో వారిమధ్య వాగ్వివాదం జరిగింది. మహిళా భక్తులు అతడిపై చేయిచేసుకున్నారు. అక్కడే ఉన్న సెక్యూరిటీ సిబ్బంది, సెల్‌ఫోన్ కౌంటర్ వద్ద పనిచేసే సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది మహిళా భక్తులను అడ్డుకుని నచ్చచెప్పారు. అయితే సెక్యూరిటీ గార్డే తమపట్ల అనుచితంగా ప్రవర్తించాడంటూ వారు ఆరోపించారు. విషయం తెలుసుకున్న ఆలయ అధికారులు పూర్తి విచారణ చేసి సమాచారం తెలియపరచాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్టు తెలిసింది.



పండిట్ నెహ్రూ బస్ స్టేషన్‌లో కార్గో కౌంటర్ ఆధునీకరణ పనులు

బస్‌స్టేషన్‌లో కార్గో కౌంటర్ విస్తరణ పనులు

బస్‌స్టేషన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో కార్గోకౌంటర్‌ను మరింత విస్తరించేందుకు అధికారులు పనులు చేపట్టారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్గో సర్వీసు దినదినాభివృద్ధి చెందుతోంది. ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. దీనిలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 10 బస్‌స్టేషన్లలో కార్గో కౌంటర్లను ఆధునీకరించేందుకు ప్రయత్నిస్తున్నారు. తొలిగా విజయవాడ పండిట్ నెహ్రూబస్‌స్టేషన్‌లోని కార్గోకౌంటర్‌ను ఆధునీకరించి కౌంటర్లలో కంప్యూటర్‌లు ఏర్పాటు చేయటంతో పాటు విశ్రాంతి తీసుకునేందుకు ఏర్పాట్లు చేపడుతున్నారు. పనులు త్వరితగతిన పూర్తిచేసి కస్టమర్లకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఎన్టీఆర్ జిల్లా ప్రజారవాణా అధికారి వై.ఏసుదానం, ఏటీఎం మోషేలు కార్గో కౌంటర్ ఆధునీకరణ పనులను వేగవంతంగా చేపడుతున్నారు. విజయవాడ కార్గో కౌంటర్ పనితీరును బట్టి మిగిలిన తొమ్మిది ప్రధాన నగరాల్లో కూడా ఆధునీకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



గండిగుంటలో రికార్డులు పరిశీలిస్తున్న డీపీవో అరుణ

వెంచర్‌లో ఉమ్మడి స్థలం అమ్మితే చర్యలు

ఉయ్యూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ వెంచర్లలో ఉన్న ఉమ్మడి స్థలాన్ని విక్రయిస్తే అమ్మిన వారిపై చర్యలు తీసుకుంటామని జిల్లా పంచాయతీ అధికారి అరుణ అన్నారు. మండలంలోని గండిగుంటలో గురువారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ, మండలంలోని గండిగుంట రియల్ ఎస్టేట్ వెంచర్లలో ఉన్న ఉమ్మడి స్థలాలను ఆయా వెంచర్ యజమానులు అక్రమంగా విక్రయిస్తున్నారన్నారు. కామన్ సైట్ పర్యవేక్షణ బాధ్యత పంచాయతీ కార్యదర్శులు, డిప్యూటీ ఎంపీడీవోలదే అన్నారు. కామన్ సైట్‌ల పర్యవేక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా కాటూరులో వేసిన వెంచర్‌లో కామన్ సైట్‌ను ఓ వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కోటేశ్వరరావు, గ్రామ కార్యదర్శి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

గన్నవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు మండలంలోని నందమూరు, తేలప్రోలు, ఆత్కూరు గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా జాయింట్ కలెక్టర్ మల్లారపు నవీన్ గురువారం పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని వసతులను పర్యవేక్షించారు. రైతులకు కనీస సౌకర్యాలు కల్పించాలని జేసీ నవీన్ ఆదేశించారు. సంబంధిత ధాన్యం కొనుగోలు కేంద్రం సిబ్బంది వివరా లు అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు గోనె సంచులు అవసరమైనంత నిల్వ ఉంచాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయని ఆరా తీశారు.

నిలువెత్తు నిర్లక్ష్యం!



పిచ్చిచెట్ల మధ్య తెల్లదేవరపల్లి పంపింగ్ స్కీమ్

(ఆంధ్రజ్యోతి, తిరువూరు/విస్సన్నపేట)

తిరువూరు, విస్సన్నపేట మండలాలకు రక్షిత తాగు నీటిని అందించేందుకు ఉమ్మడి రాష్ట్రంలో తెల్లదేవరపల్లి వాటర్ పంపింగ్ స్కీమ్‌కు శంకుస్థాపన జరిగింది. పనులైతే మొదలు పెట్టారు కానీ, పూర్తి చేయలేకపోయారు. ఆలనా పాలన లేక ప్రాజెక్టు నిరుపయోగంగా మారింది. కోట్లు ఖర్చుచేసి నిర్మించిన పంపింగ్‌స్కీమ్ భవనం పిచ్చిచెట్లమధ్య దీనంగా కనిపిస్తోంది. దీనికి సంబంధించిన విద్యుత్ మోటర్లు చోరీకి గురయ్యాయి. తిరువూరు, విస్సన్నపేట మండలాల్లో పలు గ్రామాలకు సురక్షత తాగునీరు అందించేందుకు, తాగు నీటి సరఫరా పైలెట్‌ప్రాజెక్టు నిర్మాణానికి అప్పటి ప్రభుత్వ పెద్దలు విస్సన్నపేట మండలంలోని తెల్లదేవరపల్లి గ్రామాన్ని ఎంపిక చేశారు. 2009లో సుమారు రూ.11 కోట్ల అంచనాతో ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయటం జరిగింది. నాటి స్థానిక ఎమ్మెల్యే, హోంమంత్రిగా ఉన్న కోనేరు రంగారావు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నూతిపాడు వద్ద ఎత్తిపోతల పథకంతో పాటు తెల్లదేవరపల్లి తాగునీటి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. గ్రామీణ తాగునీటి సరఫరాశాఖ ప్రత్యేక విభాగం ఆధ్వర్యంలో పనులు ప్రారంభించారు. తెల్లదేవరపల్లి వద్ద పంపింగ్ స్కీమ్ పనులతో పాటు, ఈ ప్రాంతంలో ముత్యాలమ్మ చెరువును సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌గా అభివృద్ధి చేశారు. చెరువు విస్తీర్ణం తక్కువగా ఉండటంతో, సమీపంలోని సాగుభూముల్ని ఎకరానికి రూ.2.50 లక్షలు చెల్లించి, అప్పట్లో కొనుగోలు చేసి మరోట్యాంక్ (చెరువు)ను సిద్ధం చేశారు. ఈ రెండు చెరువుల విస్తీర్ణం 100 ఎకరాలు చేసి స్టోరేజ్ ట్యాంక్‌గా మార్చారు. ఎన్ఎస్పీ కాల్వ నుంచి నీటిని సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్‌కు మళ్లించి, అక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు పైపులైన్లు ఏర్పాటు చేసి, విద్యుత్ మోటర్లద్వారా తిరువూరు, విస్సన్నపేట మండలంలోని గ్రామాలకు నీటిని సరఫరా చేసేందుకు, ఆయా ప్రాంతాలకు పైపులైన్లు వేశారు. తెల్లదేవరపల్లి నుంచి తిరువూరు తాగునీటి పంపింగ్ స్కీమ్ వరకు పైపులైన్ నిర్మించారు. కాలక్రమంలో పథకం అంచనాలు పెరిగిపోయాయి. ప్రస్తుతం తెల్లదేవరపల్లి తాగునీటి పైలెట్‌ప్రాజెక్టుకు సుమారు రూ.23 కోట్లు ఖర్చు చేశారు. తిరువూరు నగర పంచాయతీగా మార్పుచెందడంతో, గ్రామీణ నీటి సరఫరా శాఖలో ఉన్న ఈ స్కీమ్ ద్వారా పట్టణం పరిధిలో తాగునీటి సరఫరా చేసే అవకాశం లేకుండా పోయింది. దీంతో తిరువూరు, విస్సన్నపేట మండల తాగునీటి సరఫరా నిమిత్తం చేపట్టిన ఈ పథకాన్ని కేవలం విస్సన్నపేటకు మాత్రమే తాగునీటి సరఫరాకు పరిమితం చేశారు. ప్రస్తుతం ఈపథకం పూర్తి కావాలంటే మరో రూ.10 కోట్లకు పైగా నిధులు అవసరమని అంచనాలు వేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వహయాంలో ఈ పథకాన్ని పూర్తిగా విస్మరించడంతో, ఓవర్‌హెడ్ ట్యాంక్, పంపింగ్ స్కీమ్ భవనం, తిరువూరు, విస్సన్నపేట ప్రధాన రహదారిపక్కన, పిచ్చిచెట్ల మధ్య దీనంగా కనిపిస్తోంది. 2023 సంవత్సరంలో ఈ పంపింగ్‌స్కీమ్ భవనంలోని విద్యుత్ మోటార్లు చోరీకి గురవడంతో, అప్పటి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విస్సన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి కేసు నమోదు కాలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం పంపింగ్‌స్కీమ్ భవనంలోకి వెళ్లలేని విధంగా భవనం చుట్టూ చెట్లు పెరిగాయి.

కోట్లు ఖర్చు చేసి ప్రారంభించిన తెల్లదేవరపల్లి తాగునీటి పంపింగ్ స్కీమ్‌ను అసంపూర్తిగానే వదిలేశారు.. ఉమ్మడి రాష్ట్రంలో శంకుస్థాపన చేసిన ఈ ప్రాజెక్టుకు ఇప్పటికి అడుగులు పడక తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోంది. ఇప్పటికైనా ప్రజల దాహార్తిని తీర్చే అతి ముఖ్యమైన వాటర్ పంపింగ్ ప్రాజెక్టును పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వంపై నియోజకవర్గ ప్రజలు గంపెడాశలు పెట్టుకున్నారు. ఇప్పటికే ప్రబలుతున్న కిడ్నీ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని అయినా స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్‌లు సమస్యకు పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది.



తాగునీటి స్టోరేజీ కోసం నాడు సిద్ధం చేసిన ముత్యాలమ్మ చెరువు

» తెల్లదేవరపల్లి పంపింగ్ స్కీమ్‌కు మోక్షం ఎప్పుడు?
» వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యంగా వదిలేశారు
» అభివృద్ధి చేస్తే.. తిరువూరు నియోజకవర్గ ప్రజలకు సాంత్వన
» దీనావస్థలో నిరుపయోగంగా పంపింగ్ స్కీమ్
» కూటమి ప్రభుత్వంలోనైనా పూర్తిచేయాలని ఎదురుచూపులు



చోరీకి గురైన విద్యుత్ మోటార్లు

స్టోరేజ్ ట్యాంక్ ముళ్లచెట్లతో, పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. ప్రస్తుతం ఈ పథకానికి పర్యవేక్షణ అధికారులు లేకపోవడంతో ప్రాజెక్టు కోసం ఖర్చుచేసిన సుమారు రూ.25 కోట్ల ప్రజాధనం వృథా అనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. తాగునీటి ప్రాజెక్టును పూర్తి చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామానికే తలమానికంగా ఉంటుందనుకున్నాం

- రాయాల నాగమణి, సర్పంచ్ తెల్లదేవరపల్లి



రెండు మండలాలకు తాగునీరు అందించే ప్రాజెక్టుకు గ్రామాన్ని ఎంపికచేయడంతో ఎంతో గర్వించాం. గ్రామం తలమానికంగా ఉంటుందనుకుంటే.. ఈ ప్రాజెక్టు అసంపూర్తిగా వదిలివేయడం గ్రామానికి మచ్చలా మారింది. ఈ పథకం పూర్తికి కూటమి ప్రభుత్వం దృష్టిసారించాలి.

చెరువులో నీరులేదని పనులు చేయలేదు

- రాయాల సురేష్, ఆయకట్టు రైతు, తెల్లదేవరపల్లి



స్టోరేజి ట్యాంక్‌లో నీరులేదనే సాకుతో అధికారులు పనులు చేయలేదు. ప్రస్తుతం చెరువులో సంవృద్ధిగా నీరు చేరింది. ఇకనైనా అధికారులు మండల ప్రజలకు తాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలి.

విజయవాడ-విశాఖ మధ్య క్వాడ్రా లైన్

(5వ పేజీ తరువాయి)

ఎదురవుతున్నాయి. ఈ రెండు ప్రాంతాల మధ్యన ఉన్న డిమాండ్‌ను సద్వినియోగం చేసుకోవటానికి వీలుగా అదనంగా మరో రెండు లైన్లను ఏర్పాటు చేయాలని రైల్వే అధికారులు ప్రతిపాదించారు. క్వాడ్రాలైన్ కారణంగా ప్రస్తుతం నడుస్తున్న రైళ్ల సంఖ్యను రెట్టింపు చేయవచ్చు. ప్రస్తుతం 120 నుంచి 240 వరకు రైళ్లను నడపటానికి అవకాశం ఉంటుంది. అదనంగా వేసే రెండు లైన్ల కారణంగా రైళ్లను మరింత వేగంగా నడపటానికి దోహదపడుతుంది. కొత్త ట్రాక్స్, ఆటోమేటిక్ సిగ్నలింగ్ కారణంగా రైళ్లను గంటకు 160 కిలోమీటర్ల వేగంతో పరిగెత్తించటానికి అవకాశం ఉంటుంది.

మరిన్ని వందేభారత్‌లు నడపటానికి దోహదం

విజయవాడ - విశాఖపట్నం మార్గంలో ప్రస్తుతం ఒకే ఒక్క వందే భారత్ రైలు నడుస్తోంది. సికింద్రాబాద్ నుంచి విశాఖకు వెళ్తోంది. వందేభారత్ రైలును వేగంగా నడిపించటం కోసం ఈ మార్గంలో అనేక ఇతర రైళ్లను రద్దు చేయాల్సి వస్తోంది. అదనంగా మరో రెండు లైన్లను ఏర్పాటు చేయటం వల్ల మరిన్ని వందే భారత్ రైళ్లను ఈ మార్గంలో నడిపించటానికి అవకాశం ఏర్పడుతుంది. మిగిలిన రైళ్లను రద్దు చేసే అవసరం కూడా ఉండదు.

బడ్జెట్ కేటాయింపుల తర్వాతే..

ప్రస్తుతం ప్రతిపాదన దశలోనే ఉంది. వచ్చే ఏడాది మొదటి త్రైమాసికంలో ఈ ప్రాజెక్టు సర్వే పూర్తికానుంది. రైల్వే బోర్డుకు నివేదించాక.. కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు చేయాల్సి ఉంటుంది. ఈ మధ్యలో అనేక దశలు ఉంటాయి. 2026వ సంవత్సరం మార్చిలో కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు చేయగలిగితే ఈ ప్రాజెక్టును త్వరగా కార్యరూపంలోకి తీసుకురావటానికి అవకాశం ఉంటుంది. టెండర్లు పిలిచి పనులు ప్రారంభించటానికి ఎంత లేదన్నా.. వచ్చే ఏడాది డిసెంబరు వరకు సమయం పట్టే అవకాశం ఉంది.

హత్య కేసులో ఏడుగురికి జీవిత ఖైదు

(5వ పేజీ తరువాయి)

కాగిత రామ్మోహనరావు(26)పై అదే గ్రామానికి చెందిన శొంఠి వీరబాబు, శొంఠి పెదపైడేశ్వరరావు, బొర్రా శ్రీనివాసరావు, బొర్రా స్వామికృష్ణ, కాగిత సోమయ్య, శొంఠి వీరవెంకటేశ్వరరావు, శొంఠి వీరాంజనేయులు, శొంఠి ముసలయ్య, కాగిత ఆంజనేయులు కక్ష పెంచుకున్నారు. ఈ కేసు 2013 ఫిబ్రవరి 28వ తేదీన విచారణకు వచ్చిన సమయంలో కాగిత రామ్మోహనరావు కోర్టులో తన సాక్ష్యం చెప్పాడు. అదేరోజు రాత్రి గ్రామంలో కాపుకాసిన ఈ తొమ్మిది మంది నిందితులు కాగిత రామ్మోహనరావుపై మారణాయుధాలతో దాడి చేశారు. ఈ దాడిలో గాయపడిన బాధితుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడి సోదరుడు కాగిత రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో మొదటి నిందితుడిగా ఉన్న శొంఠి వీరబాబు, 9వ నిందితుడిగా ఉన్న కాగిత ఆంజనేయులు కేసు విచారణలో ఉండగానే మరణించారు. ఈ కేసులో తొమ్మిది మంది సాక్షులను విచారించారు. ఈ కేసులో ఏడుగురు నిందితులపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

ఉదయం తప్పిపోయారు.. రాత్రికి దొరికారు



తప్పిపోయిన పిల్లలను తల్లికి అప్పగిస్తున్న పోలీసు అధికారులు

విజయవాడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇంటివద్ద ఆడుకుంటున్న చిన్నారులు అకస్మాత్తుగా అదృశ్యమయ్యారు. చుట్టుపక్కల ఎంత గాలించినా ప్రయోజనం లేదు. చివరికి ఆ చిన్నారులను పోలీసులు తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. రామవరప్పాడులోని వంతెన వద్ద ఉంటున్న దుర్గయ్య, మహాలక్ష్మి దంపతులు కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వారికి ఆరేళ్ల బాబు, నాలుగేళ్ల పాప వున్నారు. బాబు రామవరప్పాడు రైల్వేస్టేషన్ సమీపంలోని పాఠశాలలో చదువుతున్నాడు. పాప అంగన్వాడీలో బడిలో చదువుతోంది. అన్నా చెల్లెళ్లు ఇద్దరూ గురువరం ఉదయం ఇంటి నుంచి బయటకు ఆడుకునేందుకు వెళ్లారు. సాయంత్రం వరకూ రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనతో చుట్టుపక్కల వారిని విచారించారు. అయినా ఫలితం లేకపోవడంతో పడమట పోలీసులను ఆశ్రయించారు. దాంతో చిన్నారుల ఫొటోలను పోలీసులు వాట్సాప్ గ్రూపుల్లో పెట్టారు. అయితే ఆ చిన్నారులు రామవరప్పాడు రైల్వేస్టేషన్ వద్ద ఆగిన రైలు ఎక్కి విజయవాడ వెళ్లినట్టు తెలుస్తోంది. తర్వాత అక్కడి నుంచి పాత ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డులో వెళుతుండగా సత్యనారాయణపురం పోలీసులు గుర్తించారు. దాంతో తప్పిపోయిన పిల్లలు వాళ్లేనని పటమట పోలీసులకు సమాచారం ఇచ్చారు. డీసీపీ కృష్ణకాంత్, ఏసీసీ దామోదర్, సీఐ కిషోర్ చిన్నారులను పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

వయోవృద్ధులకు ప్రేమను పంచుదాం



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పెద్దరికం ఎన్నటికీ చిన్నబోకూడదని, వయోవృద్ధులకు ఈరోజు మనం ప్రేమ, ఆప్యాయతను పంచితే భవిష్యత్తులో మన పిల్లల నుంచి అవే ఆత్మీయతానురాగాలను పొందుతామని వయోవృద్ధుల సంక్షేమ చట్ట స్ఫూర్తి ట్రిబ్యునళ్ల ఉత్తర్వుల్లో ఉట్టిపడాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. గురువారం కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి వయోవృద్ధుల సంక్షేమ కమిటీ సమావేశం జరిగింది. విజయవాడ, తిరువూరు, నందిగామ రెవెన్యూ డివిజన్లతో పాటు అప్పీలేట్ ట్రిబ్యునల్‌కు వచ్చిన క్లెయిమ్‌ల పరిష్కారంతో పాటు వయోవృద్ధుల క్షేమం, సంక్షేమానికి సంబంధించి భవిష్యత్తు కార్యాచరణపై సమావేశంలో చర్చించారు. మొత్తం 433 క్లెయిమ్‌లకు ఇప్పటికే 395 క్లెయిమ్‌ల పరిష్కారం జరగ్గా, మిగిలిన క్లెయిమ్‌ల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏదో ఒకరోజు వృద్ధాప్యానికి చేరువ కావాల్సిందేనని, ఈరోజు మన తల్లిదండ్రులను ఎలా చూస్తామో భవిష్యత్తులో మనకూ అవే పరిస్థితులు ఎదురవుతాయన్న విషయాన్ని గుర్తించి వయోవృద్ధులకు ప్రేమను పంచుదామన్నారు. ఎవరైనా తప్పుచేస్తే చట్టం ఓ కంట కనిపెడుతోందని, రక్షణ కల్పిస్తోందనే విషయాన్ని గుర్తెరగాలన్నారు. వయోవృద్ధుల సంక్షేమం విషయంలో రెవెన్యూ, పోలీసు, వయోవృద్ధుల సంక్షేమం తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు.

ప్రతి గ్రామంలో లాఫింగ్ క్లబ్‌లు

వయోవృద్ధుల మానసిక ఆరోగ్య పరిరక్షణకు ప్రతి గ్రామంలోనూ లాఫింగ్ క్లబ్‌ల ఏర్పాటుకు చేయూతనివ్వాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో నెలకోసారి సీనియర్ సిటిజన్స్‌తో సమావేశాలు నిర్వహించాలన్నారు. డివిజన్, జిల్లాస్థాయిలోనూ ఇదేవిధమైన చొరవ చూపాలన్నారు. వయోవృద్ధులు తమ అనుభవాల సారాన్ని చిన్నారులకు తెలియజెప్పి, వారిలో నైతిక విలువలు, క్రమశిక్షణ పెంపొందించేందుకు ఉద్దేశించిన ప్రాజెక్ట్ జెన్ ఆల్ఫాకు సరైన కార్యాచరణ రూపొందించాలన్నారు. తొలుత గురుకుల పాఠశాలల్లో ప్రారంభించాలని సూచించారు. డీసీపీ కేజీవీ సరిత, డీఆర్‌వో ఎం లక్ష్మీ నరసింహం, జిల్లా విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్స్, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ వీ కామరాజు, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం సుహాసిని, ఉమ్మడి కృష్ణా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సెక్రటరీ ఎం వెంకటేశ్వరరావు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్‌ల సభ్యులు ఎన్ కామేశ్వరి, రామిరెడ్డి వెంకటేశ్వరరావు, ఎస్ బాలాజీ పాల్గొన్నారు. వర్చువల్‌గా నందిగామ ఆర్డీవో కే బాలకృష్ణ, తిరువూరు ఆర్డీవో కే మాధురి హాజరయ్యారు.

ప్రజా భద్రతలో రాజీ ప్రసక్తే లేదు

ప్రజా భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తూ క్షేత్రస్థాయి అధికారులు విస్తృత తనిఖీలతో నిరంతర పర్యవేక్షణ తప్పనిసరని, అలసత్వానికి తావులేకుండా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. గురువారం కలెక్టర్ లక్ష్మీశ కలెక్టరేట్ నుంచి ఆర్డీవోలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ పండుగల సందర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఆలయాల వద్ద పటిష్ఠ భద్రత, రక్షణ ఏర్పాట్లు, సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెట్రోల్ బంక్‌లు, థియేటర్లు వంటి వాటిని కూడా ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలన్నారు. ప్రజల భద్రతతో ముడిపడిన విషయాల్లో రాజీపడే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు. శిథిలావస్థ భవనాల విషయంలోనూ నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎన్టీటీపీఎస్‌లో ప్రమాదం

» బ్రాయిలర్ నుంచి ఎగసిపడిన సెగ

» ఏడీఈకు తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన ఏడీఈ శేషుబాబు

ఇబ్రహీంపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ ఎన్టీటీపీఎస్‌లో భద్రతా చర్యల్లో యాజమాన్యం నిర్లక్ష్యం మరోమారు స్పష్టమైంది. గురువారం ప్లాంట్‌లోని స్టేట్-3లో బ్రాయిలర్ వద్ద జరిగిన ప్రమాదంతో విధుల్లో ఉన్న ఏడీఈ శేషుబాబు త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకోగలిగాడు.. అయితే ఒళ్లంతా కాలిపోయింది. బ్రాయిలర్‌ను పరిశీలిస్తుండగా ఒక్కసారిగా డోర్ తెరుచుకోవడంతో ఎగసిపడిన సెగను గమనించిన ఆయన వెనుకకు తిరిగడంతో వీపు మొత్తం కాలిపోయి తీవ్రంగా గాయపడ్డారు. తోటి ఉద్యోగులు వెంటనే స్పందించడంతో ఆయన ప్రాణాలతో బయటపడ్డారు. ఎన్టీటీపీఎస్‌లో తరచుగా జరుగుతున్న ప్రమాదాలతో ఉద్యోగులు, కార్మికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని పనిచేయాల్సిన పరిస్థితి దాపురించింది. గతంలో బ్రాయిలర్ డోర్స్ ఇలానే ఒక్కసారిగా తెరుచుకోవడంతో కార్మికుడి ఒంటిపై వేడి మట్టి పడి తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. మరో కార్మికుడు తీవ్రంగా గాయాలపాలయ్యాడు. ఇటీవల కాలంలో బొగ్గు తీసుకెళ్లే కన్వేయర్ బెల్ట్ కాలిపోయి పెద్ద ప్రమాదం తప్పింది. కాలం చెల్లిన బాయిలర్‌ల వినియోగం వల్ల ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రెషర్ నియంత్రణ పరికరాల నాణ్యతపై కూడా ఉద్యోగులు, కార్మికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

చిట్ నిర్వాహకుల ఆస్తుల జప్తునకు రాష్ట్ర హోంశాఖ ఆదేశాలు

(5వ పేజీ తరువాయి)

నిర్వాహకుల ఆస్తులను జప్తు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. దీంతో ఆస్తుల జప్తు అనుమతుల నిమిత్తం రాష్ట్ర హోంమంత్రిత్వ శాఖకు కలెక్టర్ నివేదిక సమర్పించారు. ఈ క్రమంలో గురువారం రాష్ట్ర హోంశాఖ ప్రొటెక్షన్ ఆఫ్ డిపాజిటర్స్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు 1999 ప్రకారం నల్లమోతు ప్రియాంక, భవానీ, రామ్‌గోపాల్ ఆస్తుల అటాచ్ చేస్తూ తదుపరి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసింది. కాగా, రాష్ట్ర హోంశాఖ ఇచ్చిన ఆదేశాల మేరకు కలెక్టర్ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ ముగ్గురు నిందితుల ఆస్తుల అటాచ్‌మెంట్ నిమిత్తం కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారు. న్యాయమూర్తి నిందితులు ఆస్తుల జప్తు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చిన తర్వాత ఆస్తులను వేలంవేసి బాధితులకు చెల్లించే అవకాశాలున్నాయి.

నీటిపై నిఘా

(5వ పేజీ తరువాయి)

ఏఈ, ఈఈలు రైతుల గోడును పట్టించుకోవట్లేదు. కాంట్రాక్టర్లకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. కాంట్రాక్టర్లు ఆడించినట్టు ఇంజనీరింగ్ అధికారులు ఆడుతున్నారు. కృష్ణాజిల్లాలో కేసీ, కేఈ, డ్రెయినేజీ విభాగాల కింద 2024-25, 2025-26 నీటి సంవత్సరాల్లో జరిగిన అభివృద్ధి పనులు లోపభూయిష్టంగా జరిగాయని అధికార పార్టీకి చెందిన నాయకుడు ఒకరు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు స్పందించారు. ఈ రెండు నీటి సంవత్సరాల్లో జరిగిన పనులకు సంబంధించిన టెండర్ల ఫైళ్లు, పనుల ఎగ్జిక్యూషన్ ఫైళ్లు, బిల్లుల వివరాలను సమర్పించాలని ఆదేశించారు. దీనికి సంబంధించి ఈ మూడు డివిజన్లకు విజిలెన్స్ అధికారులు లేఖలు రాశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	246
చికెన్ స్కిన్‌లెస్	256

నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 600

గౌరీశంకరస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.3.92లక్షలు

గుడివాడ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : దేవదాయశాఖ అధికారులు, ధర్మకర్తల మండలి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గౌరీశంకరస్వామి దేవస్థాన హుండీ ఆదాయ లెక్కింపు ద్వారా రూ.3,92,632ల ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో వేణుగోపాలరావు తెలిపారు. గురువారం దేవస్థాన ఆవరణలో దేవదాయశాఖ తనిఖీదారు ఉయ్యూరు సుధాకర్ పర్యవేక్షణలో ధర్మకర్తల మండలి కమిటీ సభ్యుల సమక్షంలో మూడు నెలల ఇరవై రోజుల కాలానికి హుండీ లెక్కింపు చేపట్టామని ఈవో తెలిపారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ నెరుసు సుభాష్ చంద్రబోసు, భక్తులు పాల్గొన్నారు.



హుండీ లెక్కింపులో పాల్గొన్న దేవదాయ శాఖ అధికారులు

ప్రతి ధాన్యపు గింజనూ కొనుగోలు చేస్తాం

కూచిపూడి : రైతుల నుంచి ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని, రైతులు అధైర్య పడాల్సిన పని లేదని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. అయ్యంకిలో రైతుల ధాన్యపు రాశులను ఎమ్మెల్యే పరిశీలించి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రామలింగేశ్వరరావు, కృష్ణాజిల్లా ప్రాజెక్టు వైస్ చైర్మన్ గణేష్ పాల్గొన్నారు.

సేవలందించిన వారికే పదవులు

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

పామర్రు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):టీడీపీ బలోపేతానికి అంకితభావంతో సేవలందించిన వారికి పదవులు తప్పక వరిస్తాయని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. స్థానిక ఏఎంసీ ఆవరణలో గురువారం జరిగిన నియోజకవర్గంలోని ఐదుమండలాలకు ఎంపికైన మండల అధ్యక్షులు, కార్యదర్శులతోపాటుగా క్లస్టర్ ఇన్‌చార్జిల పదవీ ప్రమాణ స్వీకారోత్సవంలో వర్ల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అప్పుల ఊబినుంచి బయటకు తీసుకువస్తూ అభివృద్ధి, సంక్షేమం రెండిటిని ఒకతాటిపై నడిపిస్తున్నారన్నారు. బూత్‌కన్వీనర్లు, యూనిట్ ఇన్‌చార్జిలు, గ్రామ, మండల, పట్టణ స్థాయి నేతలు పార్టీకి వెన్నుముకలని, ప్రతిఒక్కరూ సమన్వయంతో సమర్థవంతంగా పనిచేస్తే పార్టీ బలోపేతం అవుతుందన్నారు. తొలుత పదవులు



టీడీపీ మండలాధ్యక్షుల పదవీ ప్రమాణ స్వీకరణలో పాల్గొన్న ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా

పొందిన టీడీపీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, రాజులపాటి శ్రీనివాసరావు, చలసాని చంటి, వీరపనేని శివరామ్, లింగమనేని రామలింగేశ్వరరావుల తోపాటు, మండల కార్యదర్శులుగా ఎంపికైన వారిచేత ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో టీడీపీ పరిశీలకులు కోటవీరబాబు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గొట్టిపాటి లక్ష్మీదాసు, కృష్ణాడెల్టా ప్రాజెక్టు వైస్‌చైర్మన్ గణేష్, మండపాక శంకర్ బాబు,సుబ్రమణ్యం, చాట్లరమేష్, ఈడే నాని, ఏఎంసీ చైర్మన్ జన్నుశోభనబాబు, డైరెక్టర్ వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పామర్రు: పేద విద్యార్థుల విద్యోన్నతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం శిథిలమైన నూతన సాంఘిక సంక్షేమ వసతిగృహాలను పునర్నిర్మాణాలు చేస్తోందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక చాట్లవానిపురం ఎస్సీకాలనీలో సాంఘిక సంక్షేమ వసతిగృహానికి మంజూరైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు రూ.3కోట్లతో నూతన నిర్మాణానికి జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ షాహెద్‌బాబుతో కలసి భూమి పూజ చేశారు. గ్రామసర్పంచ్ కస్తూరి, డివిజనల్ ఎస్సీ సంక్షేమశాఖ అధికారి తుంగల వెంకటకృష్ణ, పామర్రు ఎడ్యుకేషన్, వేల్ఫేర్ కార్యదర్శులు కంఠమనేని పల్లవి, వైష్ణవి, జ్యోతి, వెంకటకిషోర్, దివ్య, అంగన్వాడీ టీచర్ చాట్ల సుజాత, రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.



మండవ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కృష్ణామిల్క్ యూనియన్ నేతలు

మండవకు ఘన నివాళి

గుడ్లవల్లేరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కృష్ణామిల్క్ యూనియన్‌ను జానకిరామయ్య అత్యున్నత స్థాయిలో నిలబెట్టారని ఆ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. కృష్ణా మిల్క్ యూనియన్ మాజీ చైర్మన్ మండవ జానకిరామయ్య సంస్మరణ సభ గురువారం గుడ్లవల్లేరు పాలశీతలీకరణ కేంద్రం ఆవరణలోని కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సభలో ఆంజనేయులు మాట్లాడుతూ సంస్థ చైర్మన్‌గా సుదీర్ఘంగా పనిచేసిన జానకిరామయ్య పాడిపరిశ్రమల అభివృద్ధి, పాడిరైతుల సంక్షేమం కోసం పలు పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేశారని ప్రశంసించారు. తొలుత జానకిరామయ్య చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కృష్ణామిల్క్ యూనియన్ ఎండీ కొల్లి ఈశ్వరబాబు, జిల్లా పాలకవర్గ సభ్యులు అర్జా వెంకటనగేష్, వల్లభనేని భాస్కర కుటుంబ సుబ్బారావు, ట్రస్టు బోర్డు సభ్యులు కాగిత జయరామ్, ఫీడ్ కమిటీ సభ్యుడు వెంకటేశ్వరరావు, చిట్టూరి దామోదరకృష్ణ , గోపీనాథ్ పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక వనసమారాధనలు

పామర్రు : ప్రజల్లో ఆత్మీయతానురాగాలు పెంచి సామాజిక సామరస్యతకు సమైక్యతకు కార్తీకమాస వనసమారాధనలు దోహదం చేస్తాయని బొగ్గవరపు సాయిబాబు,సాంబశివరావులు పేర్కొన్నారు. స్థానిక వెంకటాద్రి మఠంలో గురువారం నూకల లక్ష్మీకాంతకుమారి, భాస్కరావు దంపతుల నేతృత్వంలో కార్తీక వనసమారాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు.

దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

గుడివాడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు, చీమకుర్తి మండలంలోని బండ్లమూడికి చెందిన దళితులపై దాడి చేసిన అగ్రకుల అహంకారులను వెంటనే అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల సుధాకర్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక గుడ్‌మెన్‌పేటలోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.

తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందాలి

● శాస్త్రవేత్త సుధారాణి

తోట్లవల్లూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందటంపైనే రైతులు ఆలోచన చేయాలని, స్థానిక నేలను బట్టి సాగుచేసే రకాలను ఎంచుకోవాల్సిన అవసరం ఉందని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ డి సుధారాణి అన్నారు. భద్రిరాజుపాలెంలో గురువారం అరటి సాగులో మెళకువలపై రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రీయపరమైన సలహాలు, సూచనలను కృషీ విజ్ఞాన కేంద్రం రైతులకు అందిస్తోందని, ఆ ప్రకారం రైతులు అరటి సాగు చేపడితే ఖర్చు తగ్గించుకుని లాభాలు పొందవచ్చని సుధారాణి వివరించారు. కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త మంజువాణి , జ్యోతి, మానస పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుధారాణి

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

తోట్లవల్లూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పెనమకూరు రైతు సేవా కేంద్రంలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్ ప్రారంభించారు. రైతులందరూ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, ఆయన కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ సూపర్‌వైజర్ నాగార్జున, కావ్య, టీడీపీ నాయకులు తలశిల శ్రీనివాస ప్రసాద్, చిగురుపాటి సుబ్రహ్మణ్యం, వీరంకి వరహాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాస కల్యాణం

కూచిపూడి: పెదపూడిలో కాజా చిన వెంకటేశ్వరరావు, ఝాన్సీలక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో గురువారం శ్రీనివాస కల్యాణ వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన చిన శేషారావు, లక్ష్మీ దంపతులు ఈ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెదపూడి, కూచిపూడి గ్రామాలకు చెందిన భక్తులు తరలి వచ్చారు. ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి సచివాలయానికీ ఒకరిని నియమిస్తున్నాం

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

● పంచాయతీ కార్యదర్శి రావి శ్రీనివాసరావు

తోట్లవల్లూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు గ్రామ సచివాలయం-1, సచివాలయం-2లో ప్రజల వినతులు స్వీకరించేందుకు ఒక్కొక్కరిని కేటాయిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి రావి శ్రీనివాసరావు తెలిపారు. సమాధానం చెప్పే దిక్కులేదు శీర్షికన ఆంధ్రజ్యోతిలో గురువారం ప్రచురితమైన వార్తా కథనంపై కార్యదర్శి స్పందించారు. సచివాలయం-1కి 5మంది, సచివాలయం-2కి 6 మంది ఉద్యోగులు మాత్రమే ఉన్నారని తెలిపారు. అయితే స్వమిత్వ సర్వే ఎంతో ప్రధానమైందని, అందుచేత సచివాలయ ఉద్యోగులతో రెండు టీమ్‌లను ఏర్పాటు చేసి కొన్ని రోజుల నుంచి గృహాలు, ఖాళీ స్థలాల సర్వేకు పంపిస్తున్నామని తెలిపారు. దీంతో సచివాలయాల్లో ప్రజలు వచ్చినపుడు ఎవ్వరు లేని పరిస్థితి ఇబ్బందిగా ఉందన్నారు. గురువారం నుంచి గ్రామ సచివాలయం-1కి వెల్ఫేర్ అసిస్టెంట్ వీరబాబు, సచివాలయం-2కి విలేజ్ సర్వేయర్ భవానిని కేటాయిస్తున్నామని, ప్రజలకు వీరు సమాధానం చెపుతారని కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. తోట్లవల్లూరులో 2,250 గృహాలు, 750 ఖాళీ స్థలాలను రోవర్స్‌తో కొలతలు వేసి సర్వే చేయాల్సి ఉందని, రోజుకి 100 గృహాలు చేయాల్సి ఉండగా స్థానిక సమస్యలతో రోజుకి 60 చొప్పున గృహాలను మాత్రమే కొలతలు తీస్తున్నారని వివరించారు. ఇది సుమారు నెల రోజులకు పైగా పడుతుందని, అప్పటి వరకు సచివాలయాల్లో ఆ ఇద్దరు ఉంటారని కార్యదర్శి వివరించారు.



రావి శ్రీనివాసరావు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	246
చికెన్ స్కిన్‌లెస్	256

నెక్ కోడిగుడ్లు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 600

ప్రభుత్వ భవనాల నాణ్యతా ప్రమాణాల పరిశీలన

పెడన రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): సచివాలయాల భవనాల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలను క్వాలిటీ కంట్రోల్ అధికారులు గురువారం పరిశీలించారు. మండలంలోని నడుపూరు, పెనుమల్లి గ్రామాలలో అధికారులు పర్యటించారు. పెనుమల్లిలో సచివాలయం, శ్మశాన వాటిక ప్రహరీ, నడుపూరులో సచివాలయం, హెల్త్ సెంటర్ల నిర్మాణాలను, చెన్నూరులో ఎస్సీ కమ్యూనిటి హాల్‌ను పరిశీలించారు. వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ వరప్రసాద్, ఏఈ రాధాకృష్ణ, పీఆర్ ఏఈ ధర్మయ్య, సర్పంచ్ గరికపాటి రామానాయుడు పాల్గొన్నారు.

ధాన్యాన్ని ఆరబెట్టాకే కొనుగోలు కేంద్రాలకు పంపండి

● రైతులతో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్


గురివిందగుంటలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పెడన రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): యంత్రాలతో వరి కోతలు కోస్తున్నవారు తేమ శాతం తగ్గేలా ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు పంపాలని రైతులకు ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సూచించారు. గురివిందగుంటలో రైతులతో ఆయన మాట్లాడారు. పండించిన రకాలు, దిగుబడులపై ఆరాతీశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తగినన్ని సంచులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ధాన్యం పంపిన రెండు రోజుల్లో రైతు ఖాతాల్లోకి డబ్బు జమ అవుతుందన్నారు. జీడీటీసీ సభ్యుడు అర్జా నగేష్, రామ్మోహనరావు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలపై దుష్ప్రచారం చేస్తున్న వైసీపీ

● దివిమార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు ఆగ్రహం

అవనిగడ్డ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆరోగ్య సంరక్షణ, వైద్య విద్య ప్రమాణాలను అసాధారణ స్థాయిలో పెంచడానికి ఉద్దేశించిన ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం(పీపీపీ) విధానంపై వైసీపీ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పీపీపీ అంటే ప్రైవేటీకరణ కాదని, ఇది ప్రభుత్వానికి ప్రైవేట్ రంగానికి మధ్య సమర్థ భాగస్వామ్యం మాత్రమేనని ఆయన స్పష్టంచేశారు. కాలేజీలపై నియంత్రణ, యాజమాన్య హక్కులు రాష్ట్ర ప్రభుత్వానికే ఉంటాయన్నారు. విద్యార్థులకు ఫ్రీ సీట్లు యథావిధిగా ఉంటాయని పేర్కొన్నారు. మెడికల్ కాలేజీలలో కన్వీనర్ కోటా సీట్లు, ఫీజుల నియంత్రణపై ఎటువంటి మార్పు ఉండదని, పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన వైద్య విద్య అందుబాటులో ఉండేలా ప్రభుత్వం అన్నిరకాల చర్యలు తీసుకుంటుందని తెలిపారు. వైద్యారోగ్య రంగంలో మౌలిక సదుపాయాల కల్పన వేగంగా జరగడానికి నిధుల సమీకరణ కోసం ఈ విధానం అవసరమని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం 17 కాలేజీలు కట్టామని చెప్పుకోవడం అవాస్తమన్నారు. కేవలం 17శాతం మాత్రమే ఖర్చుపెట్టిందని, కొన్ని కాలేజీల్లో కనీసం సిబ్బంది, హాస్టళ్లు లేవని, అడ్మిషన్లు తీసుకురాలేకపోయారని ఆయన విమర్శించారు. టీడీపీ నేతలు పర్చూరి దుర్గాప్రసాద్, బండే రాఘవ, ఘంటసాల రాజమోహనరావు, దాసినేని శ్రీనివాసరావు, బచ్చు రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.


గ్రంథాలయ వారోత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రవికుమార్ తదితరులు

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

● విజయవంతం చేయాలని పాఠకులు, సాహితీవేత్తలకు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రవికుమార్ పిలుపు

మచిలీపట్నం టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని అన్ని గ్రంథాలయాల్లో ఈనెల 14 నుంచి వారం రోజుల పాటు నిర్వహించనున్న గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని పాఠకులు, సాహితీవేత్తలు, సాహితీప్రియులకు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రవికుమార్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా గ్రంథాలయ సంస్థలో వారోత్సవాల ఆహ్వాన పత్రికలను ఆయన ఆవిష్కరించారు. 14వ తేదీ ప్రారంభోత్సవ సభలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారన్నారు. 15న నీకు నచ్చిన జాతీయ నాయకుడు చిత్రలేఖన పోటీలు జరుగుతాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. సాయంత్రం 5 గంటలకు భారతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో మండలి వెంకటకృష్ణారావు శతజయంతి ఉత్సవాల పురస్కారాల కార్యక్రమం ఉంటుందని, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పాల్గొంటారని తెలిపారు. 16న ఆంధ్రసారస్వతి సమితి ఆధ్వర్యంలో సాహిత్యం క్విజ్, 17న సాహితీమిత్రులు ఆధ్వర్యంలో సాహిత్య సభ, 18న భావతరంగిణి ఆధ్వర్యంలో సభా కార్యక్రమాలు, 19న తెలుగు భాషా సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం, 20న వారోత్సవాల ముగింపు ఉంటుందన్నారు. లైబ్రేరియన్ బీర వెంకటరమణ, నగేష్ పాల్గొన్నారు.


ప్రజా నాట్యమండలి కళాకారుడు ఏడీ నాగేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీఐ నేతలు

ఏడీ నాగేశ్వరరావు జీవితం ఆదర్శం

చల్లపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజానాట్యమండలి కళాకారుడిగా, కవిగా, రచయితగా సమాజాన్ని చైతన్యపరిచేందుకు అహర్నిశలు కృషిచేసిన ఏడీ నాగేశ్వరరావు జీవితం అందరికీ ఆదర్శనీయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కేవీవీ ప్రసాద్ తెలిపారు. వక్కలగడ్డ గ్రామానికి చెందిన ప్రజానాట్యమండలి నాయకుడు అడ్డాడ దుర్గానాగేశ్వరరావు మూడవ వర్ధంతి గురువారం జరిగింది. పార్టీ నాయకులు ఏడీ నాగేశ్వరరావు చిత్రపటానికి నివాళులు అర్పించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకుడు ఆర్.పిచ్చియ్య, రైతుసంఘం రాష్ట్రనేత హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, మల్లుపెద్ది రత్నకుమారి, దాసి సీతారామరాజు, మల్లుపెద్ది అజయ్‌బాబు, నక్కా శ్రీనివాసరావు, కొల్లూరు శ్రీధర్, కావూరు పరమేశ్వరరావు, అడ్డాడ వెంకటేశ్వరరావు, చంద్రమోహన్ పాల్గొన్నారు.

విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేత

చల్లపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వక్కలగడ్డ గ్రామానికి చెందిన ఎన్నారై మండవ శేషగిరిరావు దాతృత్వంతో గ్రామానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థిని ఓగిరాల శివపార్వతికి పంపారు. విశ్రాంత ఉపాధ్యాయిని హనుమానుల రాణీకుమారి ద్వారా ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ చేతులమీదుగా ల్యాప్‌టాప్‌ను విద్యార్థినికి అందజేశారు. గుంటూరులో శిక్షణ నిమిత్తం రూ.30వేలు, హాస్టల్ ఫీజు నిమిత్తం నెలకు రూ.4300 చొప్పున చెల్లించేందుకు ఎన్నారై శేషగిరిరావు హామీ ఇచ్చారు.

వైభవంగా వనసమారాధన

పెడన, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వర్తక వాణిజ్య మండలి ఆధ్వర్యంలో చిట్టూరి మాధవరావుతోటలో గురువారం కార్తీక వనసమారాధన వైభవంగా నిర్వహించారు. తోటలోని ఉసిరి, తులసి చెట్ల వద్ద కాత్యాయనీదేవి ఆలయం, నాగేంద్ర స్వామి పుట్ట వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమానికి పట్టణ వర్తక వాణిజ్య మండలి అధ్యక్షుడు బొలిశెట్టి బాలరాజు నేతృత్వం వహించారు.

గ్రామస్థాయి అధికారులు బాధ్యతగా పనిచేయాలి

● ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచన


అవనిగడ్డలో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

అవనిగడ్డ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. గురువారం అవనిగడ్డ గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలోని నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ - గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్థాయి అధికారులు బాధ్యతగా పనిచేసేలా మండల అధికారులు కచ్చితమైన ఆదేశాలు ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలను స్వచ్ఛంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఎస్సీ నివాస ప్రాంతాల్లో శ్మశానాల ఏర్పాటుపై అధికారులతో చర్చించారు. తదుపరి ప్రజాదర్బార్ ఈనెల 20వ తేదీ అవనిగడ్డ రెవెన్యూ హాలులో ఏర్పాటుచేయాలని సూచించారు. గ్రామ సచివాలయ వ్యవస్థలో పనిచేస్తున్న సిబ్బంది పనితీరును మండల అధికారులు క్రమం తప్పకుండా సమీక్షించాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు సూచించారు. ప్రజాదర్బారులో స్వీకరించిన అర్జీలను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ పరిశీలించి, సత్వర పరిష్కారం చూపాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు, మోపిదేవి తహసీల్దార్లు కె.నాగమల్లేశ్వరరావు, సీహెచ్ వీరాంజనేయప్రసాద్, జె.సౌజన్య కిరణ్మయి, ముప్పిరిశెట్టి హరనాథ్, విజయప్రసాద్, ఎంపీడీవో డి.సుబ్బారావు, పీఆర్ డీఈ పి.సురేష్, ఇరిగేషన్ డీఈ గణపతి, ఏఎస్‌డబ్ల్యూవో పర్వీన్ సుల్తానా, ఈవో శ్రీనివాసరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


సఖి సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు

మహిళల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

మచిలీపట్నం టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా సఖి సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వస్తోందని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు తెలిపారు. మెప్మా ఆధ్వర్యంలో గురువారం నగర కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ బాపిరాజు ఆధ్వర్యంలో సఖీ సురక్ష కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఉచిత వైద్య సేవలను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు విచ్చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యం దిశగా మెప్మా ముందడుగు వేస్తోందని ఆయన అన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, టీడీపీ కార్పొరేటర్లు మరకాని సమతాకీర్తి, చిత్తజల్లు నాగరాము, బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పీవీ ఫణికుమార్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ ఇమిడాబత్తుల దిలీప్‌కుమార్, జనసేన నాయకులు గడ్డం రాజు, పినిశెట్టి వేణుగోపాల్ పాల్గొన్నారు.

17న చలో ఢిల్లీ విజయవంతం చేద్దాం

● ఎమ్మార్పీఎస్ నాయకుల పిలుపు


చలో ఢిల్లీ కార్యక్రమ కరపత్రాలు విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మచిలీపట్నం టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17న చలో ఢిల్లీ పేరుతో నిర్వహించే దళితుల ఆత్మగౌరవ ప్రదర్శన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో మాదిగలు కార్యక్రమానికి తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు జలదంకి నరసింగరావు మాదిగ పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నగరంలోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద చలో ఢిల్లీ కార్యక్రమ కరపత్రాలను గురువారం విడుదల చేశారు. సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయిపై దాడి జరిగి నెల రోజులు కావస్తున్నా నేటికీ చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం దారుణమని జలదంకి నరసింగరావు మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పసుమర్తి దినేష్ మాదిగ, అనుబంధ సంఘాల లీగల్ అడ్వయిజర్ గురువిందపల్లి విజయ్‌బాబు, కొక్కిలిగడ్డ రమేష్ మాదిగ, నిరంజన్, మట్ట ప్రభాస్, జునపూడి భాస్కరరావు మాదిగ, బేతపూడి రవి, బండారు సోమేశ్వరరావు, కొడాలి మోషే, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవాలయాల పునరుద్ధరణకు దాతలు ముందుకు రావాలి

● ఆధ్యాత్మికవేత్త రాధామనోహర్‌దాస్


బందరు కోట రామాలయాన్ని సందర్శిస్తున్న రాధామనోహర్‌దాస్

మచిలీపట్నం టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): 'హైందవధర్మం దేవాలయాల్లో ప్రతిధ్వనించాలి. శిథిలమైన దేవాలయాలను పునరుద్ధరించేందుకు దాతలు ముందుకు రావాలి' అని ఆధ్యాత్మికవేత్త రాధామనోహర్‌దాస్ పిలుపునిచ్చారు. బందరుకోటలో మంత్రి కొల్లు రవీంద్ర, నీలిమ దంపతులు అభివృద్ధి చేస్తున్న కోదండ రామాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఆలయంలో సీతారాములు, రాజరాజేశ్వరి, గణపతి ప్రత్యేక అర్చనల్లో పాల్గొన్నారు. రాధామనోహర్ దాస్ భక్తులనుద్దేశించి అభిభాషించారు. కోదండ రామాలయాన్ని మంత్రి కొల్లు రవీంద్ర పునరుద్ధరించడం ముదావహమన్నారు. రాధామనోహర దాస్‌ను మాజీ కౌన్సిలర్ బచ్చుల అనిల్‌కుమార్ సత్కరించారు. గొడుగుపేట వేంకటేశ్వరస్వామి దేవస్థానం పాలకమండలి సభ్యురాలు జొన్నలగడ్డ మాధవి పాల్గొన్నారు.

అగస్త్యేశ్వర స్వామి సేవలో..

పెడన: కార్తీకమాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని గంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామిని గురువారం రాధామనోహర్‌దాస్ దర్శించుకున్నారు. దేవాలయాలను, దేవుడి ఆస్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత హిందూ సమాజాలపై ఉందన్నారు. స్వామిని దర్శించుకున్న అనంతరం గోశాల స్థలాన్ని పరిశీలించారు.


ధాన్యం కొనుగోలు విధానాన్ని సొసైటీ సెక్రటరీని అడిగి తెలుసుకుంటున్న మండలి వెంకట్రామ్

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

కోడూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కోడూరు సొసైటీ వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం.శ్రీధర్ తెలిపారు. గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ సందర్శించారు. ధాన్యం కొనుగోలు విధానాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా 100 కేజీల ధాన్యం రూ.2389, 75 కేజీల(గ్రేడ్ వన్) ధాన్యం బస్తా రూ.1792కు ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. సొసైటీ అధ్యక్షుడు పూతబోయిన కరుణకుమార్, సీఈవో అరజా నగరాయులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం



విజేతలతో కరస్పాండెంట్ మోళి థామస్

అవనిగడ్డ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో బాలల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. జూనియర్, సీనియర్ విభాగాలకు నిర్వహించిన వివిధ క్రీడాపోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులను గోల్డ్, సిల్వర్ పతకాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సిస్టర్ మోళి థామస్, ప్రిన్సిపాల్ లూర్దు మేరీ, వైస్ ప్రిన్సిపాల్ మెలీ థామస్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు


లక్ష్మీపురం దుర్గాపార్వతీసమేత సోమేశ్వరస్వామి ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

చల్లపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా లక్ష్మీపురంలోని దుర్గాపార్వతీసమేత సోమేశ్వరస్వామి ఆలయంలో గురువారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను భక్తులు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. దంపతులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వ్రతాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు భమిడిపాటి బాలసుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గర్భాలయంలోని సోమేశ్వరస్వామికి, దుర్గాపార్వతీ అమ్మవారికి విశేష అలంకరణలు చేశారు.


కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

మాచవరంలో సామూహిక కుంకుమ పూజలు

కోడూరు: మాచవరం గ్రామంలోని శ్రీరామేశ్వరస్వామి దేవాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని గురువారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ విచ్చేసి స్వామిని, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.

అభాగ్యులకు చేయూత

కోడూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రామకృష్ణాపురం గ్రామపంచాయతీ పరిధిలోని ఇరాలి గ్రామంలో తల్లిదండ్రులు లేని విద్యార్థులకు, చిన్న వయసులోనే భర్తను కోల్పోయిన మహిళకు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి మచిలీపట్నానికి చెందిన వీరనాల ఫౌండేషన్ చేయూత అందించింది. గురువారం ఫౌండేషన్ చైర్మన్ బాలాజీ ఇరాలి గ్రామంలో తల్లిదండ్రులు లేని 11మంది విద్యార్థులకు స్కూల్ యూనిఫాం, వితంతు మహిళలు ముగ్గురికి కుట్టుమిషన్లు, క్యాన్సర్ బాధిత మహిళకు నిత్యావసర సరుకులు, బియ్యం అందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు శ్రీనాథ్, మానస, గ్రామస్థుడు గంజాల వెంకన్న బాబు పాల్గొన్నారు.

అయోడైజ్డ్ ఉప్పునే వాడాలి

● విద్యార్థులకు అవగాహన కల్పించిన ఎన్‌సీడీసీ ప్రోగ్రాం అధికారి హిమబిందు

మచిలీపట్నం టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అయోడైజ్డ్ ఉప్పునే వాడాలని విద్యార్థులకు జిల్లా ఎన్‌సీడీసీ ప్రోగ్రాం అధికారి హిమబిందు సూచించారు. గ్లోబల్ అయోడిన్ లోప వ్యాధుల నివారణ వారోత్సవాల్లో భాగంగా వర్రెగూడెం యూపీహెచ్‌సీ పరిధిలోని నూరుద్దీన్‌పేట ఎంపీఎల్‌పీఎస్ ఉర్దూ పాఠశాల విద్యార్థులకు ఆమె అవగాహన కల్పించారు. అయోడిన్ శరీరంలో థైరాయిడ్ గ్రంథి సక్రమంగా పనిచేయడానికి అత్యవసరమని యూపీహెచ్‌సీ వైద్యాధికారి వైదేహి తెలిపారు. అయోడిన్ లోపం వల్ల మానసిక వికలాంగత వస్తుందని, శారీరక మానసిక వికాసం మందగిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం, టీచర్లు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.